
Licensed to post with payment at RMS, Hyd



UDBHAVA

Edited, Printed, Published and owned by
Dr. M. Madhava Vasu and Printed at Saraswathi Printers,
Plot No.1, 1-24-21/4, (24-387), Sri Sai Nagar, Lothukunta,
Alwal, Secunderabad - 500 015. Telangana and
Published at Plot No.1, 1-24-21/4, (24-387),
Sri Sai Nagar, Lothukunta, Alwal,
Secunderabad - 500 015, Telangana.
Editor : Dr. M. Madhava Vasu,
RNI No: 87195 (APTEL/2005/14638)
Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com

ఉద్యోగినుల భద్రత అందరి బాధ్యత

ఎన్‌హెచ్‌ఆర్‌సి మార్గదర్శకాలు

ఉద్భవ

www.udbhavamagazine.com

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Volume : 20 Issue: 8 November 2026 Pages: 72 Rs.10



హక్కుల స్వరానికి అత్యున్నత పురస్కారం

నవనీతం పిళ్ళైకి నోబెల్ 'శాంతి'

ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Regn. No. 87195 (APTEL/2005/14638)

Volume: 20 * Issue: 8 * November 2026 * Pages: 72 Rs.10

www.udbhavamagazine.com

Founder and Editor in Chief

Dr. M. Madhava Vasu

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

Advisors:

Sri M. Madhusudhan Reddy
Advocate

Sri P. Balreddy
Advocate

Sri S. Mohan Rao
Journalist

Kakinada Correspondent :
Sri D. Venugopal Rao

లోపలి పేజీల్లో...

- హక్కుల స్వరం నవనీతం పిళ్ళైకి నోబెల్ 'శాంతి' 3
- నోబెల్ గ్రహీతలలో మహిళల వాటా 7% 7
- బాలికలకు సాధికారత.. మెరుగైన భవిత 10
- బాలికల కలలను సాకారం చేద్దాం 17
- నీ ధైర్యం అసామాన్యం 19
- ఇంటర్నెట్ వినియోగం పిల్లల ప్రాథమిక హక్కు 21
- వెట్టిచాకిరీ వ్యవహారంపై ఎన్‌హెచ్‌ఆర్‌సి సీరియస్ 29
- ఉద్యోగినుల భద్రత అందరి బాధ్యత 31
- భారతదేశంలో మానవ హక్కుల పరిరక్షణలో కీలక తీర్పులు 56
- దివ్యాంగులకు కనీస వయసు నిబంధన ఎత్తివేత 61

UDBHAVA
Edited, Printed, Published and Owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com

UDBHAVA
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.

DISCLAIMER
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.

ACKNOWLEDGEMENT OF THE SOURCE
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

సంపాదకీయం

మహిళలు, ఉద్యోగినుల భద్రత ఎండమావేనా?

అర్ధరాత్రి స్త్రీ స్వేచ్ఛగా, నిర్భయంగా తనంత తానుగా ఇంటికి చేరగలిగినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని మహాత్మాగాంధీ చెప్పిన మాటలు నేటికీ చర్విత చరణమే. మన దేశానికి దాస్య శృంఖలాలు వీడి ఏడు దశాబ్దాలు దాటినా మహిళలకు స్వేచ్ఛ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఆధునిక యుగంలో పోటీపడుతూ అన్ని రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని, సాధికారతను సాధించుకుంటున్నా సమాజంలో తనకు లభిస్తున్న భద్రతలో మాత్రం ఇంకా వెనకబడే ఉంది. ఇంట్లోనూ, ఇంటి బయటా, ఆఫీసులోనూ ఇలా ఒకటేమిటి – ఇంటి నుంచి బయలుదేరి – మళ్లీ ఇంటికి చేరేవరకూ ఎన్ని రకాల వేధింపులకు గురవుతుందో చెప్పనలవి కాదు. పోలీసు స్టేషన్ల వరకూ వచ్చేవి కొన్నయితే, పరువు కోసం దిగమింగుకునేవారి సంఖ్య లెక్కకు మించి ఉన్నదని చెప్పక తప్పదు. లైంగిక వేధింపుల విషయానికొస్తే బాలికల నుంచి మహిళల వరకూ వయోభేదం లేకుండా బాధితులుగా మిగిలిపోతున్నారు. బాలికలు పాఠశాలల్లోనే ప్రసవిస్తున్నారంటే వారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మహిళల భద్రతకు సంబంధించి దేశంలోని ప్రధాన నగరాల్లో జరిపిన సర్వేను జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇటీవల విడుదల చేసింది. దేశ రాజధానిలోనే తమకు రక్షణ కరువైందని ఢిల్లీ మహిళలు తేల్చిచెప్పారంటే వారు ఎంతగా అభద్రతకు గురవుతున్నారో అర్థమవుతోంది. ముంబయి, విశాఖ వంటి నగరాలు సురక్షితమని తేల్చింది అరవై శాతం మాత్రమే. దేశవ్యాప్తంగా జరిపిన ఈ సర్వేలో మొత్తంమీద నలభై శాతం మంది మహిళలు అభద్రతలో బతుకుతున్నామని కుండబద్దలు కొట్టారు. రాత్రి వేళల్లో ముఖ్యంగా ప్రభుత్వ రవాణా మార్గాల్లో, వినోద ప్రదేశాల వద్ద భద్రత అంతంతమాత్రమే. రాత్రివేళల్లో పోలీసుల పహారా, ఎక్కడికక్కడ సీసీ టీవీ కెమెరాల నిఘా, ఒంటరిగా కాకుండా సమూహంగా వెళ్లడం, స్వీయ రక్షణ విధానాల్లో నైపుణ్యం సాధించడం వంటి చర్యలకు ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో, పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలు సైతం లైంగిక వేధింపులకు గురికావడం ఇటీవల కాలంలో పెరిగిపోవడం ఆందోళనకరం. ఎన్‌హెచ్‌ఆర్‌సి తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలతోనైనా పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిద్దాం.



హక్కుల స్వరానికి అత్యున్నత పురస్కారం

2026 నోబెల్ శాంతి పురస్కారానికి దక్షిణాఫ్రికా న్యాయమూర్తి నవనీతం పిళ్లై ఎంపిక

భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా న్యాయమూర్తి నవనీతం నవి పిళ్లైని 2026 నోబెల్ శాంతి పురస్కారం వరించింది. అంతర్జాతీయ న్యాయ రంగం, మానవ హక్కుల పరిరక్షణలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన దక్షిణాఫ్రికాకు చెందిన న్యాయమూర్తి. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా, అంతర్జాతీయ నేర న్యాయస్థానాలకు సైతం న్యాయమూర్తిగా సేవలందించారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల పురోగతికి,



మహిళా హక్కుల రక్షణకు చేసిన కృషిని గుర్తించి 2026 ఏడాదికిగానూ నోబెల్ శాంతి పురస్కారం ప్రకటించారు. నవనీతం నవి పిళ్లై 1941 సెప్టెంబర్ 23న దక్షిణాఫ్రికాలోని డర్బన్ నగరంలో ఒక తమిళనాడుకు చెందిన భారత సంతతి కుటుంబంలో జన్మించారు. నాటల్ యూనివర్సిటీ నుంచి బీఏ, ఎల్ఎల్బి పట్టాలు పొందారు. ఆ తరువాత అమెరికాలోని హార్వర్డ్ లా స్కూల్ నుంచి ఎల్ఎల్ఎమ్, డాక్టర్ ఆఫ్ జ్యూరిడికల్ సైన్స్ డిగ్రీలు పూర్తి చేశారు. హార్వర్డ్ లా స్కూల్ నుంచి డాక్టరేట్ పొందిన తొలి దక్షిణాఫ్రికా మహిళగా నవి పిళ్లై రికార్డు సృష్టించారు. 1967లో నాటల్ ప్రావిన్స్‌లో సొంతంగా లా ఫార్మ్ ప్రారంభించిన మొదటి శ్వేతజాతీయేతర మహిళగా నిలిచారు. దక్షిణాఫ్రికాలోని జాతి వివక్ష పాలన కాలంలో ఆమె వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన నేతలకు, హక్కుల కార్యకర్తలకు లాయర్‌గా ఉచితంగా సేవలందించారు. రాబెన్ ఐలాండ్‌లో జైలు శిక్ష అనుభవిస్తున్న నెల్సన్ మండేలా వంటి ప్రముఖ నేతల ప్రాథమిక హక్కుల కోసం, జైలులో వారి పరిస్థితి మెరుగ్గా ఉండాలంటూ పోరాడారు.

రువాండా అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ సేవలు

1995లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా నెల్సన్ మండేలా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, నవీ పిళ్లైని దక్షిణాఫ్రికా హైకోర్టు మొదటి నల్లజాతీయ మహిళా న్యాయమూర్తిగా నియమించారు. అదే ఏడాది ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ రువాండా అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ న్యాయమూర్తిగా ఆమెను నియమించి గౌరవించింది. ఆమె నాలుగేళ్ల పాటు అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో జాన్ పాల్ అకయేసు కేసులో మానభంగాన్ని కేవలం వ్యక్తిగత నేరంగా కాకుండా, "జెనోసైడ్", యుద్ధ నేరంగా గుర్తించే తీర్పును వెలువరించడంలో కీలక పాత్ర పోషించారు.

అంతర్జాతీయ నేర న్యాయస్థానం, యుఎన్ హైకమిషనర్‌గా..

2003లో ది హేగ్‌లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం ఏర్పాటు కాగా, తొలి ఆరుగురు న్యాయమూర్తుల బృందంలో నవి పిళ్లై ఒకరు కావడం విశేషం. 2008 నుండి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా బాధ్యతలు

నిర్వహించారు. ఆ సమయంలో ఆమె ప్రపంచవ్యాప్తంగా జరిగే యుద్ధ నేరాలు, జాతి నిర్మూలన, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, LGBTQ+ హక్కులు, మహిళా సాధికారతపై తన గళాన్ని వినిపించడంలో విజయం సాధించారు. మయన్మార్ రోహింగ్యా సంక్షోభం, ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో మానవ హక్కుల ఉల్లంఘనలపై ఏర్పాటు చేసిన యుఎన్ స్వతంత్ర కమిషన్‌కు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. న్యాయ రంగంలో, మానవ హక్కుల కోసం చేసిన సేవలకుగానూ ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ గౌరవ పురస్కారాలు, యూనివర్సిటీల నుంచి గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు.

పేదరికం, జాతి వివక్షతో పోరాటం..

నవీ పిళ్లై 1941 సెప్టెంబరు 23న దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జన్మించారు. తల్లిదండ్రులు నారాయణసామి నాయుడు, శాంతమ్మ. నవీ జన్మించడానికి ముందే ఆమె తాతయ్య నిర్బంధ కూలీగా తమిళనాడు నుంచి దక్షిణాఫ్రికాకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. తండ్రి బస్ డ్రైవరు సహా అనేక వృత్తులు చేశారు. దారిద్ర్యం, వర్ణ వివక్ష వాతావరణంలో నవీ పిళ్లై పెరిగి పెద్దయ్యారు. ఆమెతో కలిపి మొత్తం 8మంది పిల్లల పోషణ ఆ పేద కుటుంబానికి కష్టంగా ఉండేది. కానీ, నవీ కష్టపడి చదివి నల్ల జాతికి చెందిన తొలి న్యాయవాదిగా ఎదిగారు. హార్వర్డ్



హక్కుల చట్టాలకు రూపశిల్పి

నోబెల్ కమిటీ కితాబు

దేశాలకే పరిమితమైన జాతుల హననం, మహిళలపై లైంగిక హింసకు సంబంధించిన అంశాలపై అంతర్జాతీయ చట్టాలు దృష్టి పెట్టి, వాటికి ఒక రూపం ఇవ్వడంలో ఆమె కృషిని కమిటీ శ్లాఘించింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలిగా, ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్ (రువాండా) న్యాయమూర్తి హోదాలో మానవ హక్కుల భావన విస్తరణకు, శాంతి సాధనకు తోడ్పాటు అందించారని తెలిపింది. హింస, యుద్ధాలకు బాధితులైన వారి పక్షాన, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు కట్టుబడి నవీ పిళ్లై పనిచేశారని పేర్కొంది. శాంతి ప్రపంచం చట్టాలు సరిగ్గా పనిచేసినప్పుడే సాధ్యమని ఆమె బలంగా నమ్మారని నోబెల్ కమిటీ కొనియాడింది.

అత్యాచారమూ యుద్ధ నేరమే

అంతర్జాతీయ క్రిమినల్ ట్రైబ్యునల్ (రువాండా వ్యవహారాలు)లో న్యాయమూర్తి నవీ పిళ్లైతో కూడిన ధర్మాసనం అప్పట్లో ఇచ్చిన తీర్పు సంచలనం రేపింది. ప్రభుత్వాధినేతలు తాము సాగించే మారణహోమంలో అత్యాచారాలను సైతం ఆయుధాలుగా వాడుకుంటున్నారని రువాండా మాజీ మేయర్ జీన్ పాల్ అకయెసు కేసులో ట్రైబ్యునల్ తేల్చింది. అంతర్జాతీయ యుద్ధ నేరాల జాబితాలో అత్యాచారాన్ని కూడా చేర్చింది. 1994లో రువాండాలో సాగిన రక్తపాతం సందర్భంగా 2వేల మందికి పైగా మహిళలపై పెద్దఎత్తున అత్యాచారాలు జరిగాయి. ఈ నేరాలకు బాధ్యునిగా మాత్రమే కాకుండా, యుద్ధ నేరస్థుడిగాను అకయెసును ప్రకటించింది.

యూనివర్సిటీ నుంచి లా పట్టా తీసుకుని దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన ఆమెకు అడుగడుగునా అవమానాలు ఎదురయ్యాయి. వాటన్నింటినీ తట్టుకుంటూ, నాతల్ ప్రావిన్స్‌లో న్యాయవాదిగా 1967లో వృత్తి జీవితం ప్రారంభించారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాఫ్రికాలో జరుగుతున్న పోరాటాలకు న్యాయ గొంతుకగా మారారు. న్యాయవాదిని పెట్టుకునే హక్కు ఆమె చేసిన పోరాటం వల్లే అక్కడి రాజకీయ ఖైదీలకు లభించింది. జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నవారి కేసులను ఆమె వాదించారు. జాతీయ మహిళా సంకీర్ణ సమితి సభ్యురాలిగా, వివక్షను నిషేధిస్తూ, రాజ్యాంగంలో కొత్తగా సమానత్వ నిబంధనను పొందుపరచడంలో కీలక పాత్ర పోషించారు. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్ష రద్దయిన తర్వాత, 1995లో హైకోర్టు న్యాయమూర్తిగా నవీ పిళ్లై బాధ్యతలు తీసుకున్నారు.

నవీ పిళ్లై 2013లో శ్రీలంకలో పర్యటించారు. మత మైనారిటీలపై అమలవుతున్న హింస, వివక్షను ఆ పర్యటనలో ఆమె ప్రపంచం దృష్టికి తెచ్చారు. ఉత్తర జాఫ్నాలోని తమిళ కుటుంబాలను కలుసుకుని, యుద్ధ సమయంలో తప్పిపోయిన వారి కుటుంబ సభ్యులు, దురాక్రమణకు గురైన వారి భూములు, సైనిక శిబిరాల్లో దుర్భరంగా గడుస్తున్న వారి జీవితాల గురించి వివరాలు సేకరించారు. వీటన్నింటికీ మితిమీరిన అధికార కేంద్రీకరణే కారణమంటూ ఆక్షేపించారు. ఇకనైనా విధానాలను మార్చుకోవాలని ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు. పిళ్లై అభ్యర్థనను ప్రభుత్వం తిరస్కరించింది. ఆ తర్వాత నాలుగేళ్లకే శ్రీలంక అంతర్యుద్ధంలో చిక్కుకోవడం గమనార్హం.

నోబెల్ గ్రహీతలలో మహిళల వాటా 7%

నోబెల్ బహుమతుల చరిత్రలో మహిళల భాగస్వామ్యం మరియు దానికి సంబంధించిన గణాంకాల వివరాలు తెలుగులో కింద ఇవ్వబడ్డాయి. 1901 నుండి 2026 వరకు నోబెల్ బహుమతి మరియు ఆర్థిక శాస్త్రంలో ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారక బహుమతి మొత్తం 70 సార్లు మహిళలకు ప్రదానం చేయబడింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 69 మంది మహిళలు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ప్రసిద్ధ శాస్త్రవేత్త మేరీ క్యూరీకి రెండుసార్లు (1903లో భౌతికశాస్త్రం, 1911లో రసాయనశాస్త్రం) నోబెల్ బహుమతి లభించడంతో ఈ సంఖ్య 70 గా నమోదైంది. మొత్తం నోబెల్ గ్రహీతలలో మహిళల వాటా కేవలం 7% మాత్రమే ఉంది. అయితే, గతంలో కంటే 2001 తర్వాత మహిళా విజేతల సంఖ్య గణనీయంగా పెరిగింది.

వివిధ రంగాల వారీ మహిళల గణాంకాలు

*నోబెల్ శాంతి బహుమతి – **21** మంది – మహిళలు అత్యధికంగా గెలుచుకున్న రంగం ఇదే.*


*సాహిత్యం – **19** మంది – సాహిత్య రంగంలో మహిళల ప్రాతినిధ్యం మెరుగ్గా ఉంది.*

*వైద్యశాస్త్రం – **14** మంది – సైన్స్ విభాగాలలో వైద్యరంగంలోనే ఎక్కువ మంది మహిళలు ఉన్నారు.*

*రసాయనశాస్త్రం – **8** మంది – మేరీ క్యూరీతో కలిపి **8** మంది మహిళలు ఈ పురస్కారం పొందారు.*

*భౌతికశాస్త్రం – **5** మంది – భౌతికశాస్త్రంలో మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంది.*

*ఆర్థికశాస్త్రం – **3** గురు – అత్యంత తక్కువగా మహిళలు ఎంపికైన రంగం.*


మేరీ క్యూరీ

మహిళా నోబెల్ విజేతలలోని ముఖ్యమైన రికార్డులు

- తొలి మహిళా విజేత: మేరీ క్యూరీ నోబెల్ బహుమతి సాధించిన మొట్టమొదటి మహిళ (1903, భౌతికశాస్త్రం). రెండు వేర్వేరు సైన్స్ విభాగాల్లో నోబెల్ సాధించిన ఏకైక వ్యక్తి కూడా ఆమెనే.

- అతి పిన్న వయస్కురాలు: పాకిస్తాన్‌కు చెందిన మలాలా యూసఫ్‌జాయ్ కేవలం 17 సంవత్సరాల వయసులోనే (2014) నోబెల్ శాంతి బహుమతిని అందుకొని చరిత్ర సృష్టించింది.

- భారతీయ మహిళా విజేత: భారతదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన ఏకైక మహిళ మదర్ థెరిసా. ఆమెకు 1979లో నోబెల్ శాంతి బహుమతి లభించింది.

- మానవ హక్కుల కోసం పోరాడిన భారత సంతతికి చెందిన దక్షిణాఫ్రికా మహిళ నవనీతం నవీ పిళ్లై 2026 ఏడాదికి నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు.

నోబెల్ శాంతి మహిళలు..

నాటి నుంచి నేటి దాకా..

- 1905 - బెర్తా వాన్ సుట్నర్ - ఆస్ట్రియా
- 1931 - జేన్ అడమ్స్ - అమెరికా
- 1946 - ఎమిలీ గ్రీన్ బాల్చ్ - అమెరికా
- 1976 - బెట్టి విలియమ్స్ - యునైటెడ్ కింగ్‌డమ్
- 1976 - మైరీడ్ కొరిగాన్ - యునైటెడ్ కింగ్‌డమ్
- 1979 - మదర్ థెరిసా - భారతదేశం
- 1982 - అల్వా మిర్డాల్ - స్వీడన్
- 1991 - ఆంగ్ సాన్ సూ కీ - బర్మా (మయన్మార్)
- 1992 - రిగోబెర్టా మెంచూ - గ్వాటెమాల
- 1997 - జోడీ విలియమ్స్ - అమెరికా
- 2003 - షిరి ఎబాడి - ఇరాన్
- 2004 - వాంగారీ మాతాయ్ - కెన్యా
- 2011 - ఎల్లెన్ జాన్సన్ సర్లీఫ్ - లైబీరియా
- 2011 - లీమ బావ్వీ - లైబీరియా
- 2011 - తవక్కోల్ కర్మన్ - యెమెన్
- 2014 - మలాలా యూసుఫ్‌జాయ్ - పాకిస్తాన్
- 2018 - నాదియా మురాద్ - ఇరాక్
- 2021 - మరియా రెసా - ఫిలిప్పీన్స్
- 2023 - నర్గెస్ మొహమ్మది - ఇరాన్
- 2025 - మమరియా కోరినా మచాడో - వెనిజులా
- 2026 - నవనీతమ్ నవీ పిళ్లై - దక్షిణాఫ్రికా (భారత సంతతి)



బెర్తా వాన్ సుట్నర్ (1905)



మదర్ థెరిసా (1979)



మలాలా యూసుఫ్‌జాయ్ (2014)



కెనడా కవయిత్రి అన్నే కార్సన్‌కు సాహిత్య నోబెల్

కెనడా కవయిత్రి అన్నే కార్సన్‌ను ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య నోబెల్ వరించింది. చారిత్రక కథన సంప్రదాయాలను మిళితం చేయడం ద్వారా సమకాలీన సాహిత్యంలో కొత్త పంథాను సృష్టించారంటూ కార్సన్ కృషిని స్వీడిష్ అకాడమీ కొనియాడింది. గ్రీక్, రోమన్ సాహిత్య గాథలు, ఇతివృత్తాల ఆధారంగా ఆమె కవిత్వం, వ్యాసాలు రాశారు. ఇరోస్ ద బిట్టర్ స్వీట్, ఆటోగ్రఫీ ఆఫ్ రెడ్, మెన్ ఇన్ ద ఆఫ్ అవర్స్.. వంటి రచనలు ఈ నేపథ్యం నుంచి వెలువడి, ప్రపంచవ్యాప్తంగా కార్సన్‌కు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. “ప్రాచీన గాథలనే సృజించినా, ఆమె తన సొంత ముద్రను వదులుకోలేదు. ఆమె రచనలే అన్నట్టు అవి చదివిస్తాయి” అని అకాడమీ శాశ్వత కార్యదర్శి ఇన్‌గ్రిడ్ కార్ల్‌బెర్గ్ కొనియాడారు. కెనడాలోని టొరంటోలో 1950లో జన్మించిన కార్సన్, అధ్యాపకులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఉత్తర అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాల్లో ప్రాచీ న సాహిత్యం బోధించారు. పదవీ విరమణ అనంతరం భర్తతో కలిసి ఐస్‌లాండ్‌లో స్థిరపడ్డారు. నాలుగేళ్లుగా అక్కడే ఉంటున్నారు. అవార్డు ప్రకటన సమయానికి ఆమె ‘గాలి సవ్వడిని వింటున్నారు’ అంటూ ప్రసిద్ధ కవిత్వ సంపుటి ‘ఇఫ్ నాట్, వింటర్’ లోని వాక్యాన్ని అవార్డు కమిటీ ప్రస్తావించింది. ఆ గ్రంథం ఆమెకు గొప్ప పేరును సంపాదించి పెట్టింది. వ్యాకరణ పండితులకు పదాలపై ఉండే మోజు, కవయిత్రికి కొత్త అర్థాలపై ఉండే ఇష్టం.. రెండింటి కలయికే కార్సన్ సాహిత్య సారం అని సాహిత్య కమిటీ చైర్మన్ ఆండర్స్ ఓల్సోన్ వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

బాలికలకు సాధికారత.. మెరుగైన భవిత

భారతదేశంలో బాలికల విద్య గురించి రాసే చాలా రచనలు ఈ విషయంలోనే పొరబడతాయి. అవి ఈ సమస్యను వైఖరుల మధ్య పోరాటంగా చిత్రీకరిస్తాయి, కానీ ఆ పోరాటం ఇప్పుడు గణనీయంగా మారిపోయింది. దేశంలోని చాలా ప్రాంతాలలో ప్రాథమిక విద్యలో బాలికల నమోదు ఇప్పుడు దాదాపుగా బాలురతో సమానంగా ఉంది, మరియు చాలా చోట్ల 'కూతుళ్లకు విద్య ఉండాలి' అనే ప్రతిపాదన ఇప్పుడు అల్పసంఖ్యాక అభిప్రాయం కాదు. సమస్య వేరే దిశకు మారింది. ఇది ఇప్పుడు రవాణా, భద్రత, దూరం, నీరు, సమయం మరియు గృహ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమస్యగా మారింది. ఇది ఇంకా కొనసాగడానికి కారణం ఏమిటంటే, వీటిలో ఏదీ వివక్షలా కనిపించదు. అవి కేవలం పరిస్థితులుగా కనిపిస్తాయి.



మొదటి సమస్య మాధ్యమిక విద్యకు మారే దశలో తలెత్తుతుంది. ప్రాథమిక పాఠశాలలు స్థానికంగా ఉంటాయి; మాధ్యమిక పాఠశాలలు తరచుగా అలా ఉండవు. ఒక అమ్మాయి చదువు కోసం ప్రయాణం చేయాల్సి వచ్చిన క్షణం నుండి, ఇంతకు ముందు లేని అనేక అంశాలు తెరపైకి వస్తాయి: రవాణా ఖర్చు, ప్రయాణ మార్గం యొక్క భద్రత, తిరిగి రావడానికి పట్టే సమయం, కూతురు ఒంటరిగా ప్రయాణించడాన్ని అందరూ అంగీకరించడం, మరియు ఆ ప్రయాణం విలువైనదేనా అని కుటుంబం చేసే లెక్కలు. అబ్బాయిల విషయంలో, ఈ అంశాలన్నీ చాలా తక్కువ తీవ్రతతో తెరపైకి వస్తాయి.

రెండవ విభజన 10 నుండి 12వ తరగతి విద్యార్థులలో కనిపిస్తుంది. తక్కువ విద్యాసంస్థలు, ఎక్కువ దూరాలు, అధిక ఖర్చులు, మరియు కొన్ని కుటుంబాలలో పెళ్లి ప్రస్తావనకు వచ్చే వయస్సు, దాదాపు అన్ని కుటుంబాలలో ఇంటి బాధ్యతల ప్రస్తావనకు వచ్చే వయస్సు దీనికి కారణం.

మూడవది పాఠశాల విద్య తర్వాత. 12వ తరగతి పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్యకు గానీ, ఉద్యోగానికి గానీ అవకాశం లేని ఒక అమ్మాయి, తాను సాధించిన విజయం దేనికీ దారితీయదని తరచుగా గ్రహిస్తుంది, ఇది ఆ కుటుంబంలోని తర్వాతి కుమార్తె పట్ల వ్యవహరించే తీరును ప్రభావితం చేస్తుంది.

ప్రతి సమస్య పరిష్కారంలో నిర్ణయాత్మక అంశం ఆడపిల్లల గురించి బహిరంగంగా చెప్పిన నమ్మకం కావడం చాలా అరుదు. దానికి కారణం దూరం, డబ్బు, భద్రత లేదా అనుకోని గృహ సంక్షోభం కావచ్చు. మరీ ముఖ్యంగా, ఒత్తిడిలో ఉన్న కుటుంబంలో, ఆడపిల్ల చదువు అనే అంశమే మార్పుకు లోనవుతుంది. సాధారణంగా ఆమె సోదరుడి చదువు అలా మారదు. ఆ అసమానతే వివక్ష, మరియు దానిని ఎవరూ బయటకు చెప్పకపోయినా అది పనిచేస్తూనే ఉంటుంది.

ఎవరూ అడ్డంకులు అని పిలవని అడ్డంకులు

దూరం. ఇదే అత్యంత తక్కువగా అంచనా వేయబడిన అంశం. కుమార్తె ఉన్న కుటుంబానికి, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు, పొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు పూర్తిగా భిన్నమైన విషయాలు ఉంటాయి. బహిరంగంగా ప్రకటించే ఏ పక్షపాతం కన్నా కూడా, ఈ రెండవ విషయమే నిశ్శబ్దంగా ఎక్కువ మంది బాలికల విద్యను దూరం చేస్తుంది.

మరుగుదొడ్డి. పనిచేసే, నీటి సరఫరా ఉన్న ప్రైవేట్ బాలికల మరుగుదొడ్డి లేని పాఠశాలకు, యుక్తవయస్సుకు వచ్చిన తర్వాత ఒక బాలిక ప్రతి నెలా కొన్ని రోజులు హాజరుకావడం మానేస్తుంది. హాజరుకాని రోజులు వెనుకబడిపోవడానికి దారితీస్తాయి,

అది చదువు మానేయడానికి ఒక కారణంగా మారుతుంది. పారిశుధ్య మౌలిక సదుపాయాలు బాలికల విద్యలో ఒక జోక్యం, కానీ దానిని ఆ విధంగా దాదాపుగా ఎప్పుడూ వర్ణించరు.

ఋతుస్రావ నిర్వహణ. ఉత్పత్తుల కొరత, బట్టలు మార్చుకోవడానికి ఏకాంత ప్రదేశం లేకపోవడం, వ్యర్థాలను పారవేసే సౌకర్యం లేకపోవడం, మరియు సహాయం అడగడాన్ని అసాధ్యం చేసే మౌన సంస్కృతి. నెలకు నాలుగు లేదా ఐదు రోజులు, సంవత్సరాల తరబడి ఇలాగే కొనసాగితే, అది గణనీయమైన అభ్యాస నష్టానికి దారితీస్తుంది.

నీటి సేకరణ. నీరు దూరంగా ఉన్నచోట, నీటి సేకరణ భారం అసమానంగా మహిళలు మరియు బాలికలపై పడుతుంది, మరియు ఇది పాఠశాల నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా, నీటి సరఫరా సంస్థ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతుంది.

సంరక్షణ బాధ్యతలు. అనారోగ్యంతో ఉన్న అమ్మమ్మ, వికలాంగుడైన తోబుట్టువు, రెండు షిఫ్టులు పనిచేసే తల్లి. ఇంటి సంరక్షణ లోటును అందుబాటులో ఉన్న స్త్రీలు, సాధారణంగా పెద్ద కుమార్తె, భరిస్తారు.

మార్గంలో భద్రత. రోడ్డుపై లేదా బస్సులో వేధింపులు జరగడమే ఒక పెద్ద విషయం, మరియు కుటుంబాలు ఆందోళన చెందడంలో తరచుగా తప్పులేదు. ఇక్కడ జోక్యం అంటే అమ్మాయిలకు జాగ్రత్తగా ఉండమని సలహా ఇవ్వడం కాదు. మార్గాన్ని సురక్షితంగా మార్చడమే ఇక్కడ ముఖ్య ఉద్దేశం.

సమయం. ఒక అమ్మాయి ఎప్పుడు సురక్షితంగా ఇంటికి తిరిగి వెళ్లగలదో పరిగణనలోకి తీసుకోకుండా షెడ్యూల్ చేయబడిన తరగతులు, కోచింగ్ మరియు పాఠశాల కార్యక్రమాలు ఆమెను సమర్థవంతంగా మినహాయిస్తాయి.

పత్రాల సమస్యలు. జనన ధృవీకరణ పత్రాలు లేకపోవడం, ఆధార్ అనుసంధాన సమస్యలు మరియు బ్లాక్ అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌ల కోసం బదిలీ సర్టిఫికేట్లు జారీ చేయకపోవడం వంటివి. ఇది అబ్బాయిలను కూడా ప్రభావితం చేస్తుంది, కానీ ఒత్తిడిలో ఉన్న కుటుంబాలలో అమ్మాయిల తరపున ఈ పత్రాల పనిని పూర్తి చేయడానికి ఎవరైనా ముందుకు వచ్చే అవకాశం తక్కువ.

ఆ జాబితాలోని ప్రతి అంశాన్ని పరిష్కరించవచ్చు, మరియు వాటిలో చాలావాటిని స్థానికంగానే పరిష్కరించవచ్చు. బాలికలు విద్యకు అర్హులా కాదా అనే విషయంలో ఎవరి అభిప్రాయాన్నీ మార్చాల్సిన అవసరం వాటిలో దేనికీ లేదు.

వాస్తవానికి విద్యతో ఎలాంటి మార్పు వస్తుంది?

బాలికల విద్య ఆవశ్యకతను సాధారణంగా వాస్తవమైనప్పటికీ, అమూర్తమైన


పదజాలంలో వివరిస్తారు. నిర్దిష్టమైన విధానాలు మరింత ఒప్పించేవిగా ఉంటాయి.

వివాహ వయస్సు. ఆలస్యంగా వివాహం జరగడానికి గల కారణాలను కచ్చితంగా అంచనా వేసే అంశాలలో పాఠశాల విద్య కూడా ఒకటి. పదహారేళ్ల వయసులో బడిలో ఉన్న అమ్మాయికి అప్పటికి పెళ్లి కాదు, మరియు ఆమె జీవితంలో పాఠశాల తన ఉనికిని కొనసాగించడం ద్వారా ఆ పనిని పూర్తి చేస్తున్నట్లే.

తల్లి మరియు శిశు ఆరోగ్యం. విద్యావంతులైన తల్లులు టీకాలు వేయించడం, పోషణ మరియు ఆరోగ్య సంరక్షణను కోరడం వంటి విషయాలలో కొలవదగినంత మెరుగైన తల్లి మరియు శిశు ఆరోగ్య ఫలితాలను కలిగి ఉంటారు. దీనిలో కొంత భాగం అక్షరాస్యత అయితే, చాలా వరకు సంస్థలతో వ్యవహరించడంలో ఉండే ఆత్మవిశ్వాసం.

గృహ సంబంధమైన సంప్రదింపుల స్థానం. సంపాదించే లేదా సంపాదించగల స్త్రీకి డబ్బు, పిల్లలు మరియు తన సొంత ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన నిర్ణయాలలో భిన్నమైన స్థానం ఉంటుంది.

పోషకాహార ప్రసారం. పోషకాహార లోపంతో ఉన్న కౌమార బాలిక, పోషకాహార లోపంతో బాధపడే యువ తల్లిగా మారుతుంది, మరియు ఆమె బిడ్డ యొక్క జీవితకాల



జీవక్రియ మరియు హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం పాక్షికంగా పుట్టుకకు ముందే నిర్ణయించబడుతుంది. కౌమార బాలికలకు పోషకాహారం మరియు విద్య అనేది నలభై సంవత్సరాల కాలపరిమితితో పనిచేసే, తరతరాల మధ్య జరిగే ఆరోగ్య కార్యక్రమం.

తర్వాతి తరం ఊహించేది ఇదే. ఒక గ్రామంలో ఒక అమ్మాయి 12వ తరగతి పూర్తి చేస్తే, ఆమె తర్వాత వచ్చే ప్రతి కుటుంబం యొక్క లెక్క మారిపోతుంది. ఇది అత్యంత నెమ్మదైన ప్రభావం, బహుశా అన్నింటికన్నా పెద్దది కూడా.

బాలికలు మరియు మహిళల కోసం జాతీయ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రచురిస్తుంది , మరియు పాఠశాల విద్యా కార్యక్రమాలను పాఠశాల విద్య మరియు అక్షరాస్యత విభాగం ప్రచురిస్తుంది.

గుర్తించదగిన మూడు వ్యత్యాసాలు

సాధికారత అంటే ప్రేరణ కాదు. అమ్మాయిలకు ఇచ్చే శిక్షణలో అధిక భాగం, వారు ఏదైనా చేయగలరని చెప్పడమే. ఈ విషయం అమ్మాయిలకు సాధారణంగా ముందే తెలుసు.

వారికి బస్సు, మరుగుదొడ్డి, స్కాలర్‌షిప్ మరియు సంక్షోభాన్ని తట్టుకుని, వారిని విడిచిపెట్టకుండా కాపాడగల కుటుంబం లేవు. బాలికలను ఉద్దేశించిన స్ఫూర్తిదాయక సందేశాలు, పరిస్థితిని మార్చే బాధ్యతను అతి తక్కువ శక్తి ఉన్న వ్యక్తిపై మోపుతాయి.

అమ్మాయిలు ఒకే రకమైన వర్గం కాదు. వైకల్యం ఉన్న అమ్మాయి పాఠశాల నుండి ఇతర పిల్లలందరితో పాటు సంక్లిష్టమైన బహిష్కరణను ఎదుర్కొంటుంది, వైకల్యం ఉన్న అమ్మాయిలు ఎక్కడైనా పాఠశాలలో చేరే అవకాశం చాలా తక్కువ.

గిరిజన కుగ్రామంలోని, వలస కుటుంబంలోని, లేదా పునరావాస కాలనీలోని కుటుంబంలోని బాలికలు కొన్ని ప్రత్యేకమైన అడ్డంకులను ఎదుర్కొంటారు, వీటిని ఒక సాధారణ కార్యక్రమం పూర్తిగా విస్మరిస్తుంది. సులభంగా చేరుకోగల గ్రామాలకు చేరే కార్యక్రమం, అతి తక్కువ ప్రమాదంలో ఉన్న బాలికలను చేరుకుంటుంది.

అబ్బాయిలు పరిష్కారంలో భాగమే కానీ వ్యతిరేకులు కాదు. కేవలం అమ్మాయిలతో మాత్రమే పనిచేసే కార్యక్రమాలు కొన్నిసార్లు, ఏమాత్రం మార్పు చెందని కుటుంబాలు మరియు సమాజాలలోకి ప్రవేశించే, అధిక అంచనాలతో ఉన్న యువతులను తయారు చేస్తాయి. బాలురు, తండ్రులు, సోదరులు మరియు పురుష ఉపాధ్యాయులతో కలిసి పనిచేయడం అనేది ఒక బాలిక విద్య ఆమె జీవితంలో వాస్తవమైన మార్పుగా పరిణమిస్తుందా లేదా అనేదాన్ని నిర్ధారిస్తుంది.

వాస్తవానికి ఏది పనిచేస్తుంది?

సమర్థవంతమైన ప్రోగ్రామింగ్ నుండి వచ్చిన నమూనాలు, వాటిలో ఏవీ నాటకీయమైనవి కావు.

నిర్దిష్ట అడ్డంకిని తొలగించండి. రవాణా. పనిచేసే మరుగుదొడ్డి. సెకండరీ పాఠశాలకు సమీపంలో ఒక హాస్టల్. ఋతుస్రావ ఉత్పత్తులు మరియు వాటిని ఉపయోగించడానికి ఒక ఏకాంత ప్రదేశం. ఇవి ఆడంబరంగా ఉండవు, వాటి ప్రభావంతో పోలిస్తే చవకైనవి, మరియు ఇవి అవగాహన ప్రచారాల కంటే నిలకడగా మెరుగైన ఫలితాలను ఇస్తాయి.

ప్రతి బాలికను విడివిడిగా గమనించండి. మొత్తం నమోదును కొలిచే కార్యక్రమాల కంటే, నిర్దిష్ట బాలికలను అనుసరించి, మొదటి వారంలో వారి గైర్హాజరును గమనించే కార్యక్రమాలు చాలా మెరుగ్గా పనిచేస్తాయి. ఒక బాలిక పాఠశాలకు వెళ్లకపోవడం అనేది ఒక స్థిరమైన వాస్తవంగా మారకముందే, ఆమె గైర్హాజరైన మొదటి పక్షం రోజులలో వారి కుటుంబంతో జరిపే సంభాషణే సాధారణంగా నిర్ణయాత్మకమైన చర్య అవుతుంది.

కేవలం అమ్మాయికే కాకుండా, కుటుంబానికి కూడా మద్దతు ఇవ్వండి. ఆమె బడి మానేయడానికి కారణం సాధారణంగా కుటుంబంలో జరిగే ఒక సంఘటన అయి ఉంటుంది. కేవలం అమ్మాయి సమస్యను మాత్రమే పరిష్కరించే కార్యక్రమం కన్నా, ఆ సంఘటనకు స్పందించి, కుటుంబాన్ని ఒక అర్హతకు అనుసంధానించడం, వైద్య ఖర్చులకు సహాయం చేయడం, ఆధారపడిన బంధువుకు మద్దతును ఏర్పాటు చేయడం వంటివి చేయగల ఒక కార్యక్రమం ఎక్కువ మంది అమ్మాయిలు బడిలో ఉండేలా చేస్తుంది.

పరివర్తన దశలను లక్ష్యంగా చేసుకోండి. వనరులను సమానంగా విస్తరించడం కంటే, క్లాస్ 5 నుండి 6 మరియు క్లాస్ 10 నుండి 11 పరివర్తన దశల వద్ద కేంద్రీకరించడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది, ఎందుకంటే ఉద్యోగుల నష్టం అక్కడే జరుగుతుంది.

స్పష్టమైన మార్గాన్ని నిర్మించండి. తన సొంత సమాజానికి చెందిన ఒక మహిళ ఉపాధ్యాయురాలిగా, నర్సుగా లేదా టెక్నీషియన్‌గా పనిచేయడాన్ని చూసే అమ్మాయి, తమ కుమార్తె విద్యపై పెట్టుబడి పెట్టకుండా చాలా కుటుంబాలను నిరోధించే “మరి తర్వాత ఏమిటి?” అనే ప్రశ్నకు సమాధానం ఇస్తుంది.

సంవత్సరాల తరబడి కొనసాగండి. దీనికి తొందరపడటానికి వీలు లేదు. అత్యధిక ప్రమాదంలో ఉన్న బాలికలు పదేపదే ప్రమాదంలో పడుతున్నారు, మరియు సంక్షోభం వచ్చిన సంవత్సరంలో కూడా ఉనికిలో ఉన్న ఒక సంస్థే వారిని పాఠశాలలో కొనసాగేలా చేస్తోంది.

బాలికలకు విద్య, స్వేచ్ఛతోనే సమానత్వ సమాజం సాధ్యం

ప్రతి సంవత్సరం అక్టోబర్ 11వ తేదీన ప్రపంచ దేశాలన్నింటిలోనూ అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తారు. బాలికల సాధికారతతోనే స్థిరమైన, శాంతియుతమైన మరియు సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్న సత్యాన్ని చాటిచెప్పడానికి ఈ రోజు ఒక మహోన్నత వేదికగా నిలుస్తుంది. ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2011 డిసెంబర్ 19న తీర్మానం 66/170 ద్వారా అక్టోబర్ 11ను అధికారికంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించింది. 2012 అక్టోబర్ 11న ప్రపంచవ్యాప్తంగా మొట్టమొదటిసారిగా ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బేటీ బచావో - బేటీ పఢావో', 'సుకన్య సమృద్ధి యోజన' వంటి విప్లవాత్మక పథకాలు బాలికల రక్షణ మరియు ఆర్థిక భరోసా కల్పించడంలో అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. సమాజంలో సగభాగమైన ఆడపిల్లకు చదువు, స్వేచ్ఛ, మరియు ప్రోత్సాహం అందిస్తే వారు దేశ సరిహద్దులను రక్షించే సైనికులుగా, శాస్త్రవేత్తలుగా, క్రీడాకారిణులుగా, మరియు దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదుగుతారని నిరూపితమైంది. అంతర్జాతీయ బాలికా దినోత్సవం చరిత్ర మరియు ఆవిర్భావం బీజింగ్ డిక్లరేషన్ నుండి ఐక్యరాజ్యసమితి అధికారిక ప్రకటన వరకు సాగిన అంతర్జాతీయ పరిణామాలు ఇవి.

బీజింగ్ డిక్లరేషన్ (1995): చైనాలోని బీజింగ్‌లో జరిగిన నాల్గవ మహిళా ప్రపంచ సదస్సులో చరిత్రలో తొలిసారిగా బాలికల హక్కులను మానవ హక్కులుగా గుర్తించే ప్రతిపాదన మొదలైంది.

ప్లాన్ ఇంటర్నేషనల్ ప్రచారం: 'బికాజ్ ఐ యామ్ ఎ గర్ల్' పేరిట అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్లాన్ ఇంటర్నేషనల్ బాలికల కోసం ప్రత్యేక దినోత్సవం ఉండాలని గ్లోబల్ ప్రచారం నడిపింది.

ఐరాస తీర్మానం (2011): కెనడా ప్రభుత్వం చొరవతో ఐక్యరాజ్యసమితి సాధారణ సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆమోదిస్తూ 2011 డిసెంబర్ 19న అక్టోబర్ 11ను అంతర్జాతీయ బాలికా దినోత్సవంగా ప్రకటించారు.

మొదటి వేడుక (2012): 2012 అక్టోబర్ 11న 'బాల్య వివాహాల నిర్మూలన' అనే ప్రధాన ఇతివృత్తంతో ప్రపంచవ్యాప్తంగా తొలి వేడుకలు జరిగాయి.



బాలికల కలలను సాకారం చేద్దాం

ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ప్రకటన

ప్రతి అమ్మాయి తన భవిష్యత్తును తనే ఊహించుకుని, తీర్చిదిద్దుకునే స్వేచ్ఛతో పెరగాలి - తాను ఏమి నేర్చుకోవాలో, ఏ కలలను వెంబడించాలో, మరియు తాను ఎవరు కావాలనుకుంటుందో తనే ఎంచుకోవాలి. అయినప్పటికీ, లక్షలాది మంది బాలికలకు ఆ భవిష్యత్తు చాలా త్వరగా అంతరాయం కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా, ప్రతి ఐదుగురు బాలికలలో ఒకరికి 18 ఏళ్లలోపు వివాహం జరుగుతోంది. ప్రతి సంవత్సరం, 12 మిలియన్లకు పైగా బాలికలు బాల్యంలోనే వివాహం చేసుకుంటున్నారు, అంటే సుమారుగా ప్రతి మూడు సెకన్లకు ఒకరు. ఈ గణాంకాలన్నింటి వెనుక, విద్య, ఆరోగ్యం, భద్రత, ఎంపికలు మరియు భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్న ఒక బాలిక ఉంది. బాల్య వివాహాలను నివారించడం, పురోగతి సాధించడం సాధ్యమే. గత 25 సంవత్సరాలుగా, బాలికల విద్య, చట్టపరమైన సంస్కరణలు మరియు సామాజిక భద్రతపై చేసిన పెట్టుబడులు సుమారు 6.8 కోట్ల బాల్య వివాహాలను నివారించడంలో సహాయపడ్డాయి. ఏది పనిచేస్తుందో మాకు తెలుసు. ఇప్పుడు కావలసింది ప్రతి బాలికను చేరుకోవడానికి రాజకీయ సంకల్పం మరియు నిరంతర పెట్టుబడి. బాలికలపై పెట్టుబడి పెట్టడం అంటే వారిని హాని నుండి రక్షించడం మాత్రమే కాదు. అంటే బాలికలను పాఠశాలలో ఉంచడం. వారికి ఆరోగ్యం, రక్షణ మరియు సామాజిక సేవలు అందుబాటులో ఉండేలా చూడటం. వారి వాణిని, నాయకత్వాన్ని బలోపేతం చేయడం. ఇంకా బాలికల ఎంపికలకు మద్దతుగా నిలిచేలా కుటుంబాలకు, సమాజాలకు అండగా ఉండటం. ప్రభుత్వాలు, భాగస్వాములు, పౌర సమాజం, సంఘాలు మరియు ప్రైవేట్ రంగం తమ వాగ్దానాలను ఆచరణలోకి మార్చాలని మేము పిలుపునిస్తున్నాము: బాలికలను రక్షించే చట్టాలను అమలు చేయాలి; బాలికలు పాఠశాలలోనే ఉండేలా చూడాలి; అవసరమైన సేవలకు ప్రాప్యతను విస్తరించాలి; హానికరమైన ఆచారాలను సవాలు చేయాలి; బాలికలు మరియు మహిళల నేతృత్వంలోని సంస్థలకు నిధులు సమకూర్చాలి; పేదరికం, సంఘర్షణ, స్థానభ్రంశం, వైకల్యం మరియు సంక్షోభం వంటి వాటి బారిన పడిన బాలికలకు పరిష్కారాలు అందేలా చూడాలి.

యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా క్రికెటర్ స్మృతి మంధాన



భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్ ఇండియా ఆమెను తమ 'సెలబ్రిటీ అడ్వకేట్'గా నియమించింది. ఈ కొత్త బాధ్యతలో భాగంగా బాలికల హక్కులు, భద్రత, వారి సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు క్రీడల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు స్మృతి కృషి చేస్తుంది. బాలికల ఆరోగ్యం, శ్రేయస్సు, సాధికారత కోసం యునిసెఫ్ ఇండియా చేపట్టే కార్యక్రమాలకు మంధాన మద్దతుగా నిలవనుంది. ఈ నియామకంపై స్మృతి మంధాన హర్షం వ్యక్తం చేసింది. "యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా చేరడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. క్రికెట్ ఆడుతూ పెరిగిన నాకు, ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని తెలిసింది. కఠోర శ్రమ, పట్టుదల, ప్రోత్సాహం ఉంటే ఆ అవకాశాన్ని అద్భుతంగా మార్చుకోవచ్చు. ప్రతి చిన్నారి, యువత పెద్ద కలలు కని, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకునే అవకాశం పొందాలి" అని ఆమె పేర్కొంది. గతంలో కూడా స్మృతి లింగ సమానత్వంపై యునిసెఫ్-ఐసీసీ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంది. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రే మాట్లాడుతూ.. స్మృతి నియామకంపై ఆనందం వ్యక్తం చేశారు. "ఒక యువ అథ్లెట్‌గా ప్రయాణం మొదలుపెట్టి, ప్రపంచ స్థాయి క్రికెట్ ఐకాన్‌గా ఎదిగిన స్మృతి ప్రస్థానం.. ప్రతిభకు అవకాశం తోడైతే ఏం సాధించవచ్చో బాలికలకు నిరూపిస్తుంది. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో, బాలికల హక్కులు, నాయకత్వం, శ్రేయస్సుపై పెట్టుబడి పెట్టడమే దేశానికి అత్యంత తెలివైన పెట్టుబడి. ప్రతి బాలిక నేర్చుకోవడానికి, ఆడటానికి, నాయకత్వం వహించడానికి, తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి స్మృతితో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం" అని వివరించారు.

నీ ధైర్యం అసామాన్యం

'ఈ కోర్టు ఇప్పటివరకు చూసిన పిల్లల్లో నువ్వే అత్యంత ధైర్యవంతురాలివి'

– 10 ఏళ్ల అత్యాచార బాధితురాలికి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సందేశం



ట్రయల్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి రజనీ రంగ

10 ఏళ్ల బాలిక బాధితురాలుగా ఉన్న లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పోక్సో) కేసులో రోహిణి ట్రయల్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి రజనీ రంగ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, ఢిల్లీ హైకోర్టు అత్యంత సున్నితమైన, మానవతా దృక్పథంతో కూడిన, స్ఫూర్తిదాయకమైన ఆదేశాన్ని జారీ చేసింది. జూలై 2026 నాటి శిక్షా తీర్పు ఉత్తర్వులో, ట్రయల్ కోర్టు న్యాయమూర్తి రంగ, 10 ఏళ్ల బాధితురాలు అమాయకంగా, దృఢంగా చేసిన ప్రకటనను ప్రత్యేకంగా గమనించారు. ఆ ప్రకటనలో ఆమె, "ఆ 'మామ' ముసలివాడయ్యేంత వరకు జైల్లో ఉంచండి" అని చెప్పింది.

ఆమె అభ్యర్థనను గౌరవిస్తూ, న్యాయమూర్తులు ప్రతిభా సింగ్ మరియు దినేష్ భట్‌లతో కూడిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం, జస్టిస్ రంగ తన సందేశంలోని అంశాలను ప్రముఖంగా ప్రస్తావించింది. ఆ సందేశంలో ఆమె న్యాయ పరిభాషను పక్కనపెట్టి ఇలా అన్నారు: "బిడ్డా, ఈ కోర్టు నువ్వు చెప్పింది విన్నది, మరియు నీ మాటలకు స్పందించింది. నిందితుడు "ఇకపై ఎప్పటికీ బయటి



గాలి పీల్చలేడు. అతను తన మిగిలిన జీవితాన్ని ఒక పంజరంలో గడుపుతాడు; ఆ పంజరంలోనే ముసలివాడై అక్కడే మరణిస్తాడు. అతను ఇకపై నీకు గానీ, నీ చెల్లెలికి గానీ, లేదా మరే ఇతర బిడ్డకు గానీ హాని చేయలేడు" అని కూడా ధర్మాసనం ఆదేశించింది. ఆ బాలిక ధైర్యాన్ని ప్రశంసిస్తూ, ధర్మాసనం ఇంకా ఇలా వ్యాఖ్యానించింది, "ఈ న్యాయస్థానం ఇప్పటివరకు చూసిన బాలికలలో నువ్వే అత్యంత ధైర్యవంతురాలివి. నువ్వు న్యాయస్థానానికి వచ్చి, నిన్ను గాయపరిచిన వ్యక్తిని చూపిస్తూ, నిజం మాట్లాడావు. మౌనంగా ఉండకుండా, నీ తల్లికి అంతా చెప్పావు. నీ ఈ ధైర్యం వలనే ఆ క్రూరమైన వేటగాడు ఇంకెప్పుడూ మరో బిడ్డకు హాని చేయలేడు." న్యాయం జరిగి, శిక్ష విధించబడినప్పటికీ, ఆ బిడ్డ కోల్పోయిన బాల్యంలోని బాధాకరమైన దశను ఈ వ్యవస్థ తిరిగి తీసుకురాలేదని కోర్టు అంగీకరించింది. అయినప్పటికీ, జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని ప్రేరేపించే హృదయానికి హత్తుకునే మాటలతో తన సందేశాన్ని ముగిస్తూ, ధర్మాసనం ఇలా పేర్కొంది, "ఈ కోర్టు నీ బాల్యాన్ని తిరిగి తీసుకురాలేదు, కానీ నీ మాట విన్నామని వాగ్దానం చేస్తోంది. ఇప్పుడు, బిడ్డా, నీ జీవితాన్ని జీవించు. బడికి వెళ్ళు, స్నేహితులను చేసుకో, నవ్వు, ఆడుకో, కలలు కను. ఈ కోర్టు నీ ధైర్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది." ఈ కేసులో, 2023 జూలై 23న, అప్పటి ఏడేళ్ల బాలికపై నిందితుడైన సుమిత్ షాక్య అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబం బుధ్ విహార్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసింది. ట్రయల్ కోర్టు మే నెలలో షాక్యను దోషిగా నిర్ధారించి, జూలైలో అతనికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తర్వాత షాక్య తన శిక్షపై హైకోర్టులో అప్పీల్ చేయగా, హైకోర్టు ట్రయల్ కోర్టు ఉత్తర్వును సమర్థించింది. ట్రయల్ కోర్టు ఆదేశించిన విధంగా, బాధితురాలి కుటుంబానికి రూ. 10.50 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. రెండు వారాల్లోగా దీనికి సంబంధించిన నివేదికను దాఖలు చేయాలని, అలాగే కోర్టు ఉత్తర్వులను ముద్రించి, పరిహార మొత్తంతో పాటు బాలికకు, ఆమె కుటుంబానికి భద్రంగా అందజేయాలని కూడా ధర్మాసనం ఢిల్లీ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ (డీఎల్ఎస్ఏ)ని ఆదేశించింది.

"బిడ్డా, ఈ కోర్టు నువ్వు చెప్పింది విన్నది, మరియు నీ మాటలకు స్పందించింది. నిందితుడు "ఇకపై ఎప్పటికీ బయటి గాలి పీల్చలేడు. అతను తన మిగిలిన జీవితాన్ని ఒక పంజరంలో గడుపుతాడు; ఆ పంజరంలోనే ముసలివాడై అక్కడే మరణిస్తాడు. అతను ఇకపై నీకు గానీ, నీ చెల్లెలికి గానీ, లేదా మరే ఇతర బిడ్డకు గానీ హాని చేయలేడు"

ఇంటర్నెట్ వినియోగం పిల్లల ప్రాథమిక హక్కు

కట్టడి చేస్తే చట్టవిరుద్ధమైన మార్గాలు వెతికే ప్రమాదం
అసభ్యకర, సెక్సువల్ కంటెంట్‌ను సహించేది లేదు
పిల్లలకు హాని కలిగించే పోస్టులు సోషల్ మీడియాలో పెట్టొద్దు
సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



ఇంటర్నెట్ వినియోగం పిల్లలతో సహా అందరి ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆన్‌లైన్ విషయంలో ఆందోళనలు ఉన్నా కూడా పిల్లలకు డిజిటల్ యాక్సెస్‌ను పూర్తిగా నిషేధించలేమని తేల్చి చెప్పింది. రాజ్యాంగంలోని 21, 19(1)(ఎ) అధికరణాల ప్రకారం ఆ హక్కుకు రక్షణ ఉందని 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే, మైనర్లతో చిత్రీకరించే సెక్సువల్ దృశ్యాలు, పోస్టులు, కంటెంట్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేయడానికి వీల్లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. చిన్నారుల మనసును పాడుచేసే ఇలాంటి కంటెంట్‌ను పూర్తిగా నిషేధించాలని ఆదేశించింది. ఈ విషయంలో సోషల్ మీడియా మధ్యవర్తులదే పూర్తి బాధ్యత అని పేర్కొంది. సోషల్ మీడియా ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై బాలల లైంగిక దోపిడీ, దుర్వినియోగ మెటీరియల్‌ను గుర్తించి, తొలగించే విధానాన్ని

బలోపేతం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. "వయసుతో సంబంధం లేకుండా పిల్లలకు కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయి. వారి ప్రాథమిక హక్కును నిరాకరించడం అసంబద్ధం అవుతుంది.

"భద్రత, స్వేచ్ఛ రెండింటికీ పిల్లలు అర్హులే" అని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఇంటర్నెట్ వినియోగం పిల్లలకు ప్రమాదకారిగా ఉందని అంగీకరిస్తూనే.. వారికి ఇంటర్నెట్‌ను పూర్తిగా నిషేధిస్తే చట్టవిరుద్ధమైన మరో మార్గం వెతుకుతారని, అది మరింత ప్రమాదమని హెచ్చరించింది. అంతేకాకుండా వక్రమార్గంలో ఇంటర్నెట్‌కు యాక్సెస్ అయ్యి వారు వేధింపులకు గురైతే.. ఆ విషయాన్ని తమ తల్లిదండ్రులకో, పెద్దలకో చెప్పడానికి వెనకడుగు వేస్తారని పేర్కొంది. అదే సమయంలో పిల్లలకు ఇంటర్నెట్ అవసరం ఎందుకో కూడా ధర్మాసనం వివరించింది. వారికి మంచి సమాచారం అందించడమే కాకుండా, నేర్చుకోవడానికి, ఆలోచనలు పంచుకోవడానికి, సృజనాత్మక వ్యక్తీకరణకు ఇంటర్నెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపింది. పిల్లల ఇంటర్నెట్ వినియోగానికి తల్లిదండ్రుల సమ్మతి, పర్యవేక్షణ ఉండాలని, పిల్లల ఖాతాలకు 'చైల్డ్ మోడ్' వంటి ప్రత్యేక ఏర్పాటు చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

సెక్సువల్ కంటెంటును ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఆఫర్ చేసినా, హోస్ట్ చేసినా, సబ్‌స్క్రిప్షన్ రూపంలో ఆఫర్ చేసినా కుదరదని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 2024లోనే ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. సోషల్ మీడియా మధ్యవర్తులు, ప్లాట్‌ఫామ్స్ ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. "చిన్నారుల లైంగిక దోపిడీ, అసభ్య కంటెంట్ ఏ రూపంలో ఉన్నా సహించేది లేదు. ప్రతి మధ్యవర్తీ దీనికి బాధ్యులవుతారు." అని హెచ్చరించింది.

ప్రతి ఒక్కరూ జర్నలిస్టే అనుకుంటే.. పెద్ద సమస్యే: సుప్రీంకోర్టు

"దేశంలో ఉన్న ప్రతీ ఒక్కరు తమను తాము జర్నలిస్టులం అని చెప్పుకొంటే అది ఇంకా పెద్ద సమస్య. ప్రతీ ఒక్కరికి సమస్యలా మారుతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. "రాజ్యాంగం ఆర్టికల్ 19కింద కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ.. ప్రతీ ఒక్కరు తమని తాము జర్నలిస్టులం అని చెప్పుకొనేందుకు అవకాశం కల్పిస్తోందా అన్నదానిపై సమగ్ర పరిశీలన అవసరం" అని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ఆందోళనలను కవర్ చేస్తున్న కొందరు మహిళా జర్నలిస్టులపై పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, ఫ్రీలాన్సింగ్, ఇండిపెండెంట్ జర్నలిస్టుల పట్ల పోలీసులు క్రూరంగా

వ్యవహరించారని, వీళ్ల భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాలని దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై విచారణ సందర్భంగా ఇద్దరు న్యాయమూర్తులు ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియా సంస్థల గుర్తింపు (అక్రెడిటేషన్) ఉన్న జర్నలిస్టులకు ఉన్నట్లే ఫ్రీలాన్స్, ఇండిపెండెంట్ జర్నలిస్టుల భద్రతకు కూడా మార్గదర్శకాలు ఉండాలని పిటిషనర్లు కోరారు.

ఫుట్‌పాత్ ఏర్పాటు చేయకపోతే ధర్నా చేస్తాం

సుప్రీంకోర్టు హెచ్చరిక

ఢిల్లీ అధికార యంత్రాంగంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టు వద్ద పాదచారుల కోసం ఫుట్‌పాత్, రోడ్డు దాటేందుకు క్రాసింగ్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. త్వరలోనే ఆ సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణలోగా ఏర్పాటుచేయకపోతే.. తామే అక్కడ స్వయంగా ధర్నాకు దిగుతామని న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ కేవీ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం హెచ్చరించింది. పనులు పూర్తయ్యేదాకా అక్కడి నుంచి కదిలేదే లేదని వ్యాఖ్యానించింది. అవసరమైతే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కూడా కోర్టుకు పిలిపిస్తామని స్పష్టం చేసింది.

సురక్షితమైన ఫుట్‌పాత్‌లు పౌరుల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయస్థానం తెలిపింది. ఇవి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21(జీవించే హక్కు), 19(1)(డీ) (స్వేచ్ఛగా తిరిగే హక్కు)కు సంబంధించిన అంశాలని వివరించింది. పాదచారుల హక్కులే తొలి ప్రాధాన్యమన్న ధర్మాసనం.. వాహన రాకపోకల కంటే వాటికే పెద్దపీట వేయాలని పేర్కొంది. ఈ మేరకు రోడ్ల వెంట ఫుట్‌పాత్‌ల ఏర్పాటు, నిర్వహణను ప్రభుత్వాలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించింది. అక్రమ దుకాణాలు, కరెంట్ స్తంభాలు, చెత్త, అక్రమ పార్కింగ్ వంటి అడ్డంకులను తక్షణమే తొలగించాలని సూచించింది. ఫుట్‌పాత్‌ల నిర్మాణంలో ఐఆర్‌సీ 103:2022 మార్గదర్శకాలను పాటించడం సహా దివ్యాంగులకు అనుకూలంగా ర్యాంపులు, జారని ఉపరితలాలు ఏర్పాటుచేయాలని తెలిపింది. పాదచారుల మార్గాల నిర్వహణపై తనిఖీలు, భద్రతా ఆడిట్‌లు చేపట్టడం సహా ఫిర్యాదుల పరిష్కారానికి ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా న్యాయస్థానం సూచించింది. తొలి దశలో భాగంగా.. 5 నగరాల్లో ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని, వీటి అమలు పర్యవేక్షణకు కేంద్ర స్థాయిలో ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేయాలని పేర్కొంది. కమిటీలు వేయడంతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో పనులు పూర్తిచేయాలని స్పష్టం చేసింది. విశాలమైన రోడ్లు, వాటిపై తిరిగే వాహనాలే అభివృద్ధికి కొలమానం కాదని.. ప్రజలు సురక్షితంగా, గౌరవంగా నడిచే సదుపాయాలు కల్పించడం కూడా ప్రభుత్వాల బాధ్యతేనని తేల్చిచెప్పింది.

రేపిస్టులకు సహకరిస్తే మహిళపైనా గ్యాంగ్‌రేప్ కేసు పెట్టొచ్చు

మహిళ అత్యాచారం చేయలేదన్న కారణంతో తప్పించుకోలేరు
ఢిల్లీ హైకోర్టు చరిత్రాత్మక తీర్పు

సామూహిక అత్యాచారం కేసుల్లో మహిళలను కూడా నేరస్తులుగా గుర్తించే విషయంలో ఢిల్లీ హైకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఒక మహిళ మరో మహిళపై లైంగికదాడికి పాల్పడే అవకాశం లేకపోయినప్పటికీ.. ఆ నేరానికి సహకరిస్తే సదరు మహిళపై సామూహిక అత్యాచారం కేసు నమోదు చేయవచ్చని గురువారం తీర్పు చెప్పింది. సామూహిక అత్యాచారం కేసు నుంచి తన పేరును తొలగించాలని ఓ మహి ళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ అనూప్ జైరాం భంభానీ నేతృత్వంలోని ధర్మాసనం ఐపీసీలోని సెక్షన్ 376 (డీ)కి స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. ఒకే ఉద్దేశంతో ఒక్కరు లేదా ఎక్కువమంది కలిసి నేరానికి పాల్పడటాన్ని ఈ సెక్షన్ నేరంగా పరిగణిస్తోందని, ఇందు లో మహిళలకు మినహాయింపు ఏమీ లేదని పేర్కొంది. ఒక మహిళపై మరో మహిళ లైంగికదాడికి పాల్పడటం భౌతికంగా సాధ్యకాదు కాబట్టి.. ఆ కేసు నుంచి తప్పించాలన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది. భౌతికంగా లైంగికదాడికి పాల్పడకపోయినా.. సహ నిందితులను అందుకు ప్రోత్సహించటం, సహాయం చేయటం, సామూహిక లైంగి క దాడి కుట్రలో పాలుపంచుకోవటం వంటి చర్యలకు పాల్పడే మహిళలపై సామూహిక లైంగికదాడి అభియోగాలు మోపవచ్చని స్పష్టంచేసింది. ఈ తీర్పుతో ఇప్పటివరకూ సామూహిక లైంగిక దాడి కేసుల్లో ఉన్న అస్పష్టత తొలగిపోయిందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఇకపై మహిళ అన్న కారణంగా ఈ నేరాల్లో భాగస్వాములైన నిందితులు తప్పించుకోలేరని వ్యాఖ్యానిస్తున్నారు.

మీరట్ బ్లూ డ్రమ్ కేసు
భార్య, ప్రియుడికి మరణశిక్ష

జిల్లా కోర్టు సంచలన తీర్పు..

మీరట్‌లో జరిగిన బ్లూ డ్రమ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతేడాది మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్య కేసులో భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె

ప్రియుడు సాహిల్ శుక్లాలకు జిల్లా కోర్టు మరణశిక్ష విధించింది. 126 విచారణలు, 22 మంది సాక్షుల వాంగ్మూలాల తర్వాత జిల్లా జడ్జి జస్టిస్ అరవింద్ కుమార్ మిశ్రా ఈ సంచలన తీర్పు ఇచ్చారు. రస్తోగి, ఆమె ప్రియుడు శుక్లా.. రాజ్‌పుత్‌ను హత్య చేయడానికి కుట్ర పన్ని, అతని శరీర భాగాలను కాంక్రీటు, ఇసుక ఉపయోగించి ఒక నీలిరంగు డ్రమ్‌లో దాచిపెట్టారని విచారణలో రుజువైనట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇలాంటి నేరాలు సమాజంలో తీవ్ర భయాన్ని సృష్టిస్తాయని వ్యాఖ్యానించారు. సౌరభ్ రాజ్‌పుత్ చాలా మంచి వ్యక్తి అని, దోషులకు మరణశిక్ష విధిస్తే తాము నిరసన తెలపబోమని ముస్కాన్ రస్తోగి తల్లిదండ్రులు కోర్టుకు తెలిపారు. రస్తోగిని కలిసేందుకు ఆమె కుటుంబ సభ్యులు ఎప్పుడూ జైలుకు వెళ్లలేదు. పోలీసుల నివేదిక ప్రకారం.. 2025 మార్చి 3న ముస్కాన్ రస్తోగి మందుస్తు ప్లాన్ ప్రకారం భర్త సౌరభ్ రాజ్‌పుత్‌కు ఆహారంలో మత్తుమందు కలిపి ఇచ్చింది. ఆ తర్వాత ప్రియుడు సాహిల్ శుక్లాతో కలిసి అతన్ని కత్తితో పొడిచి చంపేశారు. దుర్వాసన రాకుండా ఉండటానికి మృతదేహాన్ని బాత్రూమ్‌లో ముక్కలుగా నరికి, ఒక పెద్ద నీలిరంగు ప్లాస్టిక్ డ్రమ్‌లో కుక్కారు. ఆపై ఇసుక, సిమెంట్ కలిపి డ్రమ్‌లో పోసి సీలు చేశారు. హత్య తర్వాత వారు హిమాచల్ ప్రదేశ్‌కు పారిపోయారు. సౌరభ్ బతికే ఉన్నట్లు నమ్మించడానికి అతడి ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు సందేశాలు పంపారు. అనుమానం వచ్చిన బంధువులు పోలీసులతో కలిసి మార్చి 17న ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా, డ్రమ్‌లో శవం కనిపించింది. రెండు రోజుల తర్వాత పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. 13 నెలల తరువాత, 126 విచారణలు, 22 మంది సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ మిశ్రా దోషులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మహిళల భద్రతపై ఓలా, ఉబర్, రాపిడోకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

యాప్ ఆధారిత క్యాబ్, బైక్ ట్యాక్సీ సేవలు అందించే ఓలా, ఉబర్, రాపిడోలకు మహిళల భద్రతకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రయాణికుల భద్రతకు ప్రైవేట్ రైడ్-హెయిలింగ్ సంస్థలను బాధ్యులను చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఢిల్లీ హైకోర్టు స్పందించింది. ఓలా, ఉబర్, రాపిడో సంస్థలతో పాటు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ ప్రభుత్వానికి కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసును డిసెంబర్ 16న తదుపరి విచారణకు తీసుకోనున్నట్లు పేర్కొంది. యాప్ ఆధారిత రవాణా సేవల్లో భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో

డ్రైవర్ల తనిఖీలపై మరింత దృష్టి అవసరమని అదిత్య సెహగల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యంపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. ఒక ప్రయాణికుడు క్యాబ్ లేదా బైక్ బుక్ చేసినప్పుడు యాప్‌లో కనిపించే డ్రైవర్, వాహనం వివరాలు, వాస్తవంగా కేటాయించిన డ్రైవర్, వాహనానికి సరిపోలేలా కఠినమైన ధ్రువీకరణ వ్యవస్థ ఉండాలని పిటిషన్‌లో కోరారు. అలాగే ఎస్ఓఎస్ అలర్ట్‌ల కోసం 24 గంటల కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిటిషనర్ ప్రతిపాదించారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, న్యాయమూర్తి తేజస్ కారియాతో కూడిన ధర్మాసనం విచారించింది. ఓలా, ఉబర్, రాపిడోతో పాటు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.

బెయిల్ మంజూరుపై సుప్రీంకోర్టుకు సలహా ఇచ్చిన బెంగాల్ న్యాయాధికారి

ఓ కేసును ఎలా పరిష్కరించాలి.. బెయిల్ ఎప్పుడు ఇవ్వాలో సుప్రీంకోర్టుకే సలహా ఇచ్చే సాహసం చేశారు ఓ దిగువ కోర్టు న్యాయాధికారి. దీనిపై సుప్రీంకోర్టు కన్నెర్రచేసి.. వివరణ ఇవ్వాలని ఆయనకు ఆదేశాలు జారీచేసింది. పశ్చిమ బెంగాల్లో ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్న ఓ అండర్ ట్రయల్ ఖైదీ బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈ ఏడాది మే 11న కొట్టివేసింది. 3నెలల్లో కేసు విచారణ పూర్తిచేయాలని ఉత్తర 24 పరగణాల జిల్లా 3వ అదనపు జిల్లా-సెషన్స్ కోర్టును ఆదేశించింది. అయితే సదరు కోర్టు న్యాయాధికారి ఈ ఆదేశాలను పాటించలేదు. పైగా నిందితుడికి బెయిల్ ఎప్పుడు ఇవ్వాలో.. ఎప్పుడు ఇవ్వకూడదో వివరిస్తూ ఆగస్టు 11న సుప్రీం అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. ఆ లేఖ జస్టిస్ పార్దివాలా, జస్టిస్ వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం ముందు ఇటీవల విచారణకు వచ్చింది. అందులోని అంశాలను చదివి.. న్యాయమూర్తులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఆయన ఇలా ఎందుకు రాశారో వివరణ కోరాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూడని పిల్లల్ని ఇంటి నుండి బయటకు గెంటేయవచ్చు ఢిల్లీ హైకోర్టు

పోషించకున్నా, అవమానించినా తమ ఇంటి నుంచి పిల్లల్ని, వారసులని పంపించేసే

అధికారం వృద్ధులకు ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే వారిని ఇంటి నుంచి ఖాళీ చేయించేలా ఆదేశించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007లోని సెక్షన్లు 22, 32 ప్రకారం ఈ నిర్ణయం సబబేనని తెలిపింది. పూనం అనే మహిళ అత్తింటివారిపై గృహ హింస చట్టం కింద కేసు నమోదు చేసింది. ఆ చట్టం ప్రకారమే తన నివాసం కోసం అత్త ఇంటిలో కొంత చోటును కేటాయించాలని కోరింది. మరోవైపు సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం బాగోగులు చూడని పూనంను తన ఇంటి నుంచి పంపించేయాలని ఆ అత్త ఢిల్లీ డివిజనల్ కమిషనర్‌కు దరఖాస్తు చేశారు. అన్నింటినీ పరిశీలించి ఇల్లు ఖాళీ చేయాలంటూ కోడలు పూనంను డివిజనల్ కమిషనర్ ఆదేశించారు. దీన్ని సవాలు చేస్తూ పూనం హైకోర్టుకు వెళ్లారు.

ఆంధ్రప్రదేశ్ న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు

రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో సేవలందిస్తున్న న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ (సర్వీస్ అండ్ కేడర్) నిబంధనలు-2026లోని రూల్ 17ను సవరించినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. వయసు పెంపుపై గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. గెజిట్ సైతం ప్రచురించింది. ఈ ఏడాది మార్చి 31 నుంచి ఈ వయసు పెంపు వర్తిస్తుందని మంత్రి పేర్కొన్నారు. గతంలో 2024 నవంబరు 1 నుంచి అమల్లోకి వచ్చేలా న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 60 నుంచి 61 ఏళ్లకు పొడిగించినట్లు తెలిపారు. కాగా, న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని సుప్రీంకోర్టు ఇటీవల ఏడు రాష్ట్రాలను ఆదేశించింది. అలాగే ఈ విషయంలో దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలు చేయడంపై ఆలోచన చేయాలని ఏపీతో సహా పలు రాష్ట్రాలకు సూచిస్తూ ఈ ఏడాది జూలై 22న, ఆగస్టు 5న ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆగస్టు 24న సమావేశమైన హైకోర్టు ఫుల్ కోర్టు కూడా రాష్ట్రంలో న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టు సిఫారసుల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనతో గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

పిల్లల భద్రత మనందరి బాధ్యత

సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్‌లో నల్సా సౌత్ జోన్ రీజినల్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిల్లల సైబర్ భద్రతపై మాట్లాడారు. 'మనం పెద్దవాళ్లం ఏది మంచో.. ఏది చెడో.. ఏది నిజమో.. ఏది అబద్ధమో తెలుసుకోగలం. కానీ పిల్లలు అలా కాదు. వారికి లోకంతీరు తెలియదు. పిల్లలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారు. వాళ్లు భయంతో ఎవరికీ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు పాత్ర ప్రముఖమైనది. ముందుగా పిల్లలతో కాస్త మాట్లాడండి. వారి గురించి తెలుసుకోండి. అలా అని వారు చేసే పొరపాట్లపై కోప్పడకూడదు. వారికి నెమ్మదిగా ప్రేమతో అవగాహన కల్పించండి. అవసరమైనప్పుడు సైబర్ నేరాల కోసం -1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం -1098 నెంబర్లను సంప్రదించండి' అని ముఖ్యమంత్రి సూచించారు. 'పిల్లలు, మహిళల భద్రత పట్ల రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు, విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షి -భరోసా సైబర్ ల్యాబ్‌లు.. ఇలా మన దగ్గర అనేక వ్యవస్థలు ఉన్నాయి. ఈ వ్యవస్థలన్నీ సమన్వయంతో పనిచేయాలి. అంతేకాకుండా.. పాఠశాల విద్యాశాఖతో TGS-LSA అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చాం. బాధిత పిల్లలకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలను రక్షించేందుకు తల్లిదండ్రులు, న్యాయశాఖ, ప్రభుత్వం కలిసి పనిచేయాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ పిలుపునిచ్చారు.

వెట్టిచాకిరీ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సి సీరియస్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పరిధిలో వెలుగుచూసిన అమానుష వెట్టిచాకిరీ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించిన కమిషన్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), డీజీపీ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. బాధితుల పరిరక్షణకు చేపట్టిన చర్యలు, కేసు పురోగతిపై నాలుగు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఉపాధి కోసం ఉత్తరప్రదేశ్ (యూపీ) నుంచి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లికి వచ్చిన ఒకే కుటుంబంలోని 12 మందిని ఓ నిర్మాణ స్థలంలో ఏడాదిపాటు అక్రమంగా నిర్బంధించిన ఘటన ఇటీవలే వెలుగు చూడడం గమనార్హం. వారంలో ఒక్కరోజు కూడా విరామం ఇవ్వకుండా, రేయింబవళ్లు పనిచేయిస్తూ వీరిని వేధింపులకు గురిచేశారు. సామాజిక కార్యకర్తల ఫిర్యాదుతో రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు రంగంలోకి దిగి వారిని రక్షించారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను హరించడమే కాదు, తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అంటూ ఆందోళన వ్యక్తం చేసింది. వెట్టిచాకిరీ చేయించుకున్న యజమాని, సూపర్‌వైజర్‌తోపాటు బాధ్యులందరిపై నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలు, దర్యాప్తు పురోగతిని తెలియజేయాలని అధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వ వెట్టిచాకిరీ పునరావాస పథకం కింద.. ఒక్కో బాధితుడికి తక్షణ ఆర్థిక సాయంగా రూ.30 వేల చొప్పున పంపిణీ చేయాలని, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిపై మానవ హక్కుల కమిషన్ ఆగ్రహం

హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య, ర్యాగింగ్ ఘటనపై

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) తీవ్రంగా స్పందించింది. యూజీసీ మార్గదర్శకాలు, యాంటీ-ర్యాగింగ్ చట్టాలను అమలు చేయడంలో విఫలమై, నాలుగు నెలలు గడిచినా తీసుకున్న చర్యల నివేదిక సమర్పించని తెలంగాణ ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదివే ఎస్టీ విద్యార్థి శ్రీసాయి తేజ ర్యాగింగ్, వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఫిర్యాదును స్వీకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ... నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని 23 ఏప్రిల్ 2026న తెలంగాణ ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. నాలుగు నెలలకు పైగా సమయం గడిచినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణించింది. అక్టోబరు 28న ఆ అధికారి స్వయంగా తగిన నివేదికలతో హాజరు కావాలని ఆదేశించింది.

సుప్రీంకోర్టులో ఊహించని ఘటన.. న్యాయమూర్తులపై ఆగ్రహించిన పిటిషనర్..

సుప్రీంకోర్టులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఓ కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయమూర్తులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డాడు. దీంతో కోర్టు హాలులో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం నిందితుడు చేతిలో ఉన్న కేసు పత్రాల కట్టను న్యాయమూర్తుల డయాస్ వైపు విసిరేయడంతో భద్రతా అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పిటిషనర్‌ను బలవంతంగా కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన న్యాయమూర్తులు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం కేసు విచారణ చేస్తున్న సమయంలో జరిగింది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఓ తీర్పును సవాల్ చేస్తూ పిటిషనర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. నేడు విచారణ సందర్భంగా స్వయంగా హాజరై తన వాదనలు వినిపించే క్రమంలో అసాధారణంగా దూకుడుగా ప్రవర్తించాడు. వాదనలు ప్రారంభించిన వెంటనే 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను ఆదేశిస్తున్నా' అంటూ న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీంతో ఆశ్చర్యానికి గురైన జస్టిస్ కేవీ విశ్వనాథన్.. 'మీరు మమ్మల్ని ఆదేశిస్తున్నారా?' అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన పిటిషనర్ 'నా తరఫున చెప్పాల్సిందంతా చెప్పాను. అన్నీ రికార్డులో ఉన్నాయి' అని పేర్కొన్నాడు. అనంతరం ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై కేసు పత్రాలను గాల్లోకి విసిరేయడంతో పాటు, కోర్టు హాలులోనే న్యాయమూర్తులను అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది పిటిషనర్‌ను కోర్టు హాలు నుంచి బయటకు తరలించారు.

ఉద్యోగినుల భద్రత అందరి బాధ్యత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ తాజా మార్గదర్శకాలు

భారత జాతీయ మానవ హక్కుల సంఘం (NHRC) 2026 అక్టోబర్ 27న ఉద్యోగినుల భద్రత మరియు ప్రజా ప్రదేశాల్లో మహిళల రక్షణకు సంబంధించిన ఒక ముఖ్యమైన అడ్వైజరీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసింది.

ప్రధాన అంశాలు

- కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహన పెంచాలి.
- అన్ని సంస్థల్లో POSH (Prevention of Sexual Harassment) చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.
- మహిళలు పని చేసే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, సరైన లైటింగ్, భద్రతా ఏర్పాట్లు కల్పించాలి.
- మహిళలపై జరిగే నేరాలపై పోలీసులు వేగంగా స్పందించాలి.
- బాధిత మహిళలకు న్యాయ, వైద్య, మానసిక సహాయ వ్యవస్థలను బలోపేతం చేయాలి.
- సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ స్టాకింగ్, డిజిటల్ మోసాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- ప్రజల్లో మహిళల భద్రత పట్ల బాధ్యత పెంచడానికి అవగాహన ...

భారతదేశంలో మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, పరిపాలన, సాంకేతిక రంగాలతో పాటు దాదాపు ప్రతి రంగంలో తమ ప్రతిభను చాటుతున్నారు. అయితే మహిళల ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్న కొద్దీ వారి భద్రత, గౌరవం, సురక్షితమైన పని వాతావరణం వంటి అంశాలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ

మానవ హక్కుల సంఘం (NHRC) మహిళల భద్రతపై తాజా అడ్వైజరీని విడుదల చేసింది. ఇందులో ఉద్యోగ మహిళలు, ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, పోలీసు శాఖలు మరియు సమాజం పాటించాల్సిన కీలక సూచనలను వివరించింది.

మహిళలు భయభ్రాంతులకు గురికాకుండా ఉద్యోగాలు నిర్వహించేందుకు, వారి మానవ హక్కులను కాపాడేందుకు మరియు కార్యాలయాల్లో వేధింపులను అరికట్టేందుకు ఈ అడ్వైజరీ రూపొందించబడింది.

దేశంలో మహిళల ఉద్యోగ భాగస్వామ్యం క్రమంగా పెరుగుతున్నప్పటికీ, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, మానసిక వేధింపులు, వివక్ష, సైబర్ నేరాలు, ప్రయాణ భద్రత వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని NHRC గుర్తించింది.

ప్రత్యేకించి:

ఉద్యోగ స్థలాల్లో లైంగిక వేధింపుల ఫిర్యాదులు పెరుగుతున్నాయి.

నగరాలు, పరిశ్రమలు, ఐటీ సంస్థల్లో రాత్రి షిఫ్ట్‌లలో పనిచేసే మహిళలకు భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయి.

ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా దుర్వినియోగం పెరుగుతున్నాయి.

అనేక సంస్థల్లో POSH చట్టం పూర్తిగా అమలు కావడం లేదు.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు NHRC సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది.

ఎనిమిది ప్రధాన అంశాలపై NHRC దృష్టి

1. లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహన

మహిళలపై కార్యాలయాల్లో జరిగే లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టేందుకు ప్రతి సంస్థలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది.

ఉద్యోగులకు: - ఏ చర్య లైంగిక వేధింపుగా పరిగణించబడుతుంది? ఫిర్యాదు ఎక్కడ చేయాలి? బాధితులకు చట్టపరమైన రక్షణ ఏమిటి? - వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలని పేర్కొంది.

2. పని ప్రదేశాల్లో భద్రతా మౌలిక సదుపాయాలు

ప్రతి కార్యాలయంలో - సీసీ కెమెరాలు, తగిన లైటింగ్, భద్రతా సిబ్బంది, అత్యవసర సహాయ వ్యవస్థలు, మహిళల కోసం ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉండాలని NHRC సూచించింది.

ముఖ్యంగా రాత్రి పూట పనిచేసే మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించాలని పేర్కొంది.

3. బైస్టాండర్ ఇంటర్వెన్షన్ (Bystander Intervention)

వేధింపులు లేదా హింస జరుగుతున్నప్పుడు చూసి ఊరుకోవడం కాకుండా, సహచర ఉద్యోగులు బాధితులకు సహాయం చేసే వాతావరణం ఏర్పడాలని సూచించింది.

"ఇది నా విషయం కాదు" అనే భావన కంటే "సహాయం చేయడం సామాజిక బాధ్యత" అనే దృక్పథం పెరగాలని NHRC అభిప్రాయపడింది.

4. పోలీసుల పాత్ర బలోపేతం

మహిళలపై నేరాల ఫిర్యాదులను వెంటనే నమోదు చేయడం, వేగంగా దర్యాప్తు చేయడం, బాధితులకు గౌరవప్రదంగా వ్యవహరించడం - వంటి చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించింది. మహిళా పోలీస్ సిబ్బంది సంఖ్యను కూడా పెంచాలని సిఫారసు చేసింది.

5. బాధిత మహిళలకు సమగ్ర సహాయం

వేధింపులకు గురైన మహిళలకు కేవలం న్యాయం అందించడం మాత్రమే కాకుండా - ఉచిత న్యాయ సహాయం, మానసిక కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాస సేవలు అందుబాటులో ఉండాలని NHRC పేర్కొంది.

6. సైబర్ నేరాల నివారణ

డిజిటల్ యుగంలో మహిళలు కొత్త తరహా నేరాలను ఎదుర్కొంటున్నారని NHRC ఆందోళన వ్యక్తం చేసింది.

వాటిలో: - సైబర్ స్టాకింగ్, సోషల్ మీడియా వేధింపులు, నకిలీ ఖాతాలు, వ్యక్తిగత ఫొటోలను దుర్వినియోగం చేయడం, ఆన్‌లైన్ బ్లాక్‌మెయిల్ ముఖ్యమైనవి. ఈ నేరాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది.

7. దీర్ఘకాలిక విధాన సంస్కరణలు

మహిళల భద్రత కోసం తాత్కాలిక చర్యలకే పరిమితం కాకుండా: - ఉద్యోగ విధానాల్లో మార్పులు, లింగ సమానత్వం, సురక్షిత రవాణా, మహిళా సంక్షేమ చర్యలు, దీర్ఘకాలికంగా అమలు చేయాలని NHRC సూచించింది.

8. సమాజంలో దృక్పథ మార్పు

మహిళల భద్రత కేవలం ప్రభుత్వ బాధ్యత కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని NHRC పేర్కొంది.

పాఠశాల స్థాయి నుంచే: మహిళల పట్ల గౌరవం, సమానత్వ భావన, మానవ హక్కుల విలువలు బోధించాలని సూచించింది.

సంస్థలు తప్పనిసరిగా చేయాల్సినవి

POSH చట్టం అమలు

ప్రతి సంస్థ:- Internal Complaints Committee (ICC) ఏర్పాటు చేయాలి.

మహిళల ఫిర్యాదులను గోప్యంగా స్వీకరించాలి.

నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తి చేయాలి.

బాధితురాలిపై ప్రతీకార చర్యలు తీసుకోకుండా చూడాలి.

రాత్రి షిఫ్ట్ ఉద్యోగినులకు రక్షణ. - సురక్షిత రవాణా - జీపీఎస్ మానిటరింగ్

డ్రైవర్ ధృవీకరణ - అత్యవసర హెల్ప్‌లైన్ వంటి వ్యవస్థలు కల్పించాలి.

భద్రతా శిక్షణ

కార్యాలయాల్లో క్రమం తప్పకుండా:- లింగ సున్నిత శిక్షణ, వేధింపుల నిరోధక కార్యక్రమాలు, సైబర్ భద్రత అవగాహన నిర్వహించాలి.

మహిళా ఉద్యోగులు తెలుసుకోవలసిన హక్కులు

భారతదేశంలో ప్రతి ఉద్యోగ మహిళకు:

- సురక్షితమైన పని వాతావరణం పొందే హక్కు
- లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందే హక్కు
- ఫిర్యాదు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ • గోప్యత రక్షణ
- చట్టపరమైన సహాయం • సమాన అవకాశాలు పొందే హక్కు - ఉన్నాయని NHRC మరోసారి గుర్తు చేసింది.

మహిళల భద్రత కేవలం చట్టపరమైన అంశం మాత్రమే కాదు, అది మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన అత్యంత ప్రాథమిక బాధ్యత. ఉద్యోగ మహిళలు భయం లేకుండా, గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో పనిచేసే వాతావరణం కల్పించగలిగితేనే దేశ అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగుతుంది. ఈ దిశగా NHRC తాజా అడ్వైజరీ ప్రభుత్వాలు, సంస్థలు మరియు సమాజానికి ఒక ముఖ్యమైన మార్గదర్శకంగా నిలుస్తోంది.

రాజ్యాంగ హక్కులకు పిల్లలూ యజమానులే

భారత రాజ్యాంగం కల్పించిన రక్షణ, స్వేచ్ఛ మరియు అవకాశాలు

పిల్లలు దేశ భవిష్యత్తు. ఒక దేశ ప్రగతి ఆ దేశంలోని పిల్లల అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించిన భారత రాజ్యాంగ నిర్మాతలు పిల్లల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, రక్షణ మరియు గౌరవప్రదమైన జీవితానికి ప్రత్యేక నిబంధనలను పొందుపరిచారు. పిల్లలు చిన్నవారు అయినప్పటికీ వారికి కూడా రాజ్యాంగబద్ధమైన హక్కులు ఉన్నాయి.

పిల్లలు కేవలం కుటుంబానికి మాత్రమే కాకుండా దేశానికి కూడా అమూల్యమైన సంపద. అందుకే భారత రాజ్యాంగం పిల్లల శ్రేయస్సు, విద్య, ఆరోగ్యం, భద్రత మరియు గౌరవప్రదమైన జీవితానికి ప్రత్యేక రక్షణలు కల్పించింది. ఈ హక్కులను అమలు చేయడంలో భారత సుప్రీంకోర్టు అనేక చారిత్రక తీర్పుల ద్వారా కీలక పాత్ర పోషించింది.

రాజ్యాంగం కల్పించిన ప్రధాన హక్కులు

అధికరణం 14 - సమానత్వ హక్కు

చట్టం ముందు ప్రతి పౌరుడు సమానుడు. పిల్లలపై కులం, మతం, లింగం, భాష లేదా సామాజిక స్థితి ఆధారంగా వివక్ష చూపరాదు.

అధికరణం 15(3) - ప్రత్యేక రక్షణ

మహిళలు మరియు పిల్లల అభివృద్ధి కోసం ప్రత్యేక చట్టాలు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం రూపొందించవచ్చు.

అధికరణం 21 - జీవించే హక్కు

ప్రతి చిన్నారికి గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే హక్కు ఉంది. ఇందులో ఆరోగ్యం, భద్రత, పోషకాహారం, స్వేచ్ఛ, వ్యక్తిత్వ వికాసం కూడా భాగమే.

అధికరణం 21A - విద్యా హక్కు

6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల ప్రతి బాలబాలికకు ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు.

అధికరణం 23 - దోపిడీ నిషేధం

మానవ అక్రమ రవాణా, బలవంతపు శ్రమ నిషేధం.

అధికరణం 24 - బాల కార్మికత్వం నిషేధం

14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకర పరిశ్రమలలో పనిచేయించడం నిషేధం.

అధికరణం 39(e) మరియు 39(f)

పిల్లల ఆరోగ్యం, బలం దుర్వినియోగం కాకుండా రక్షించాలి. వారు గౌరవప్రదమైన వాతావరణంలో పెరిగే అవకాశాలు కల్పించాలి.

అధికరణం 45

ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రారంభ బాల్య సంరక్షణ, విద్య అందించాలి.

పిల్లల హక్కులపై ముఖ్యమైన సుప్రీంకోర్టు తీర్పులు

1. Unni Krishnan vs State of Andhra Pradesh (1993)

ఈ చారిత్రక కేసులో సుప్రీంకోర్టు విద్య హక్కును జీవించే హక్కులో భాగంగా గుర్తించింది. తరువాత దీనివల్ల రాజ్యాంగంలో అధికరణం 21A చేర్చబడింది.

తీర్పు సారాంశం: "విద్య లేకుండా వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యం కాదు."

2. Bandhua Mukti Morcha vs Union of India (1984)

బాల కార్మికత్వం, బానిస కార్మికుల సమస్యపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు పిల్లలను దోపిడీ నుంచి రక్షించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేసింది.

సంబంధిత అధికరణాలు: 21, 23, 24, 39.

3. Sheela Barse vs Union of India (1986)

పిల్లల నిర్బంధం, బాల గృహాల పరిస్థితులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

తీర్పు ముఖ్యాంశం: పిల్లల గౌరవం, భద్రత, మానసిక ఆరోగ్యం Article 21లో భాగమని కోర్టు పేర్కొంది.

4. M.C. Mehta v. State of Tamil Nadu (1996)

చిన్నారులను ప్రమాదకర పరిశ్రమలలో పనిచేయించడం చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలు: బాల కార్మికులను పనుల నుండి తొలగించాలి. వారికి విద్య అందించాలి. పునరావాసం కల్పించాలి.

5. Gaurav Jain vs Union of India (1997)

వేశ్యావృత్తిలో ఉన్న మహిళల పిల్లలకు సమాన విద్యా అవకాశాలు, గౌరవప్రద జీవనం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కోర్టు పేర్కొంది.

6. Avinash Mehrotra vs Union of India (2009)

పాఠశాలల్లో పిల్లల భద్రతపై ఈ కేసు కీలకమైనది.

సుప్రీంకోర్టు అభిప్రాయం: "పిల్లలకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం వారి ప్రాథమిక హక్కు." పాఠశాలల్లో అగ్ని ప్రమాద నివారణ చర్యలు తప్పనిసరి అని ఆదేశించింది.


7. Sampurna Behura vs Union of India (2018)

జువెనైల్ జస్టిస్ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ముఖ్య సూత్రం: "ప్రతి నిర్ణయంలోనూ బాలుడి శ్రేయస్సే ప్రథమ ప్రాధాన్యం."

డిజిటల్ యుగంలో పిల్లల హక్కులు

నేటి ప్రపంచంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, డిజిటల్ విద్య పిల్లల జీవితంలో భాగమయ్యాయి. విద్య, విజ్ఞానం, సమాచారాన్ని పొందే హక్కు పిల్లలకు ఉంది. అయితే వారిని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులు, డిజిటల్ వ్యసనాల నుండి రక్షించడం తల్లిదండ్రులు, పాఠశాలలు మరియు ప్రభుత్వ బాధ్యత. పిల్లల హక్కులను పరిమితం చేసే ప్రతి చర్య "పిల్లల శ్రేయస్సు" అనే ప్రమాణం మీద పరీక్షించబడాలని భారత న్యాయస్థానాలు పలు సందర్భాలలో పేర్కొన్నాయి. భారత రాజ్యాంగం పిల్లలను దేశ భవిష్యత్తుగా గుర్తించి వారికి విద్య, ఆరోగ్యం, రక్షణ, సమానత్వం, గౌరవప్రదమైన జీవితానికి బలమైన హక్కులను కల్పించింది. సుప్రీంకోర్టు తీర్పులు ఈ హక్కులకు మరింత బలం చేకూర్చాయి. పిల్లల శ్రేయస్సు కోసం ప్రభుత్వం, పాఠశాలలు, తల్లిదండ్రులు, సమాజం కలిసి పనిచేసినప్పుడే రాజ్యాంగం ఆశించిన సామాజిక న్యాయం సాకారమవుతుంది.



మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

సరస్ మేళాలో మంత్రి సీతక్క ప్రకటన

మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'సరస్ మేళా'కు మంత్రి సీతక్క హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. మహిళల ఆర్థిక ఎదుగుదల ద్వారానే గ్రామీణ పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని, ఆ ఉద్దేశంతోనే ప్రతి ఏటా 'సరస్ మేళా'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు రూ. 67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేసిందని, మహిళలే స్వయంగా వ్యాపారాలను విజయవంతంగా నడిపిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. శిల్పారామం పక్కన ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి బజార్'లో 106 షాపులను మహిళా సంఘాలకు కేటాయించామని, రాష్ట్రవ్యాప్తంగా 22 'ఇందిరా మహిళా శక్తి భవనాలను' అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు.



ప్రజాప్రతినిధులపై నేరారోపణలు.. మహిళలపై అఘాయిత్యాల కేసులు

దేశవ్యాప్తంగా 187 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు
14 మందిపై ఏకంగా అత్యాచార ఆరోపణలు
తెలంగాణలో ఐదుగురు, ఏపీలో 22 మందిపై అభియోగాలు
ఐదుగురు కేంద్ర మంత్రులపైనా కేసులు: ఏడీఆర్ నివేదిక

చట్టసభల్లో మహిళల రక్షణపై గళమెత్తాల్సిన ప్రజాప్రతినిధులపైనే తీవ్రమైన నేరారోపణలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఏకంగా 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులకు సంబంధించిన కేసులు ఉన్నట్లు అసోషియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తన నివేదికలో వెల్లడించింది. మొత్తం 4,881 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అత్యాచారం, మహిళల గౌరవానికి భంగం కలిగించడం, వేధింపులు వంటి నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల వివరాలతో ఏడీఆర్ శుక్రవారం ఒక నివేదిక విడుదల చేసింది. ఈ జాబితాలో 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 14 మంది ప్రజాప్రతినిధులపై (12మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు లోక్‌సభ ఎంపీలు) నేరుగా అత్యాచారం కేసులు ఉండటం గమనార్హం. ఐదుగురు కేంద్ర మంత్రులపై కూడా మహిళలపై నేరాలకు సంబంధించి ఆరోపణలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే, మహిళలపై నేరాల కేసులున్న ప్రజాప్రతినిధుల జాబితాలో పశ్చిమ బెంగాల్ 69 మందితో మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ 22మందితో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) రెండో స్థానంలో నిలిచింది. ఒడిశా 17 మంది ప్రజాప్రతినిధులతో మూడో స్థానంలో ఉంది. తెలంగాణలో మొత్తం ఐదుగురిపై (ముగ్గురు లోక్‌సభ ఎంపీలు,

ఇద్దరు ఎమ్మెల్యేలు) కేసులు ఉన్నాయి. పార్టీల వారీగా చూస్తే బీజేపీ 106 మంది(95 ఎమ్మెల్యేలు, 11 మంది ఎంపీలు)తో అగ్రస్థానంలో నిలవగా, 20 మంది(19 ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ)తో కాంగ్రెస్ రెండో స్థానంలో, 18 మంది(17 ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ)తో టీడీపీ మూడో స్థానంలో నిలిచింది. కాగా, బీజేపీకి చెందిన 11 మంది ఎంపీలలో ఐదుగురు కేంద్ర మంత్రులు ఉన్నారు. వీరిలో ఒక మంత్రి తెలుగు రాష్ట్రాలకు చెందినవారు కావడం గమనార్హం.

తెలుగు రాష్ట్రాల్లో కేసుల వివరాలు..

తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలపై కేసులు నమోదు కాగా, అందులో తొలిసారి గెలిచిన సిట్టింగ్ ఎంపీపై అత్యాచారం కేసు ఉంది. ఇక ఏపీలో నలుగురు మంత్రులపై కూడా కేసులు నమోదవగా.. ఒక ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు ఉంది. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన ఒక యువ ఎంపీతో పాటు రాష్ట్రంలో రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక సీనియర్ నేతపై కూడా అభియోగాలు ఉండటం గమనార్హం. నేర చరిత్ర, ప్రత్యేకించి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తీవ్రంగా ఆక్షేపించింది. వారిని ఎన్నికల్లో పోటీకి శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, క్రిమినల్ నేపథ్యం ఉన్న ప్రజాప్రతినిధుల కేసులను వేగవంతం చేసి సత్వరమే విచారించాలని విజ్ఞప్తి చేసింది.



ముగ్గురు స్నేహితులతో కలిసి భార్యపై భర్త గ్యాంగ్‌రేప్

ముగ్గురి అరెస్టు.. పరారీలో భర్త..
నిందితులంతా మయన్మార్ దేశస్థులు

మద్యానికి బానిసై, స్నేహితుల వద్ద డబ్బులు తీసుకున్న ఓ వ్యక్తి, ఆ అప్పు తీర్చేందుకు కట్టుకున్న భార్యను ఆ మిత్రులతో గడపాలని ఒత్తిడి చేశాడు. ఆమె ససేమిరా అనడంతో స్నేహితులను ఇంటికి పిలిపించి ఆమెపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆమెను ఇంట్లో బంధించి.. తరచూ స్నేహితులతో కలిసి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడుతున్నాడు. చంపాపేటలో ఈ ఘటన వెలుగుచూసింది. నిందితుడు మహ్మద్ ఫయాజ్ (30). అతడు మయన్మార్ దేశస్తుడు. అక్రమంగా భారత్‌లో అడుగుపెట్టి హైదరాబాద్ కొచ్చాడు. మయన్మార్‌కే చెందిన యువతి (20)ని పెళ్లి చేసుకున్నాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రోషన్‌దౌలా బస్తీ సమీపంలో భార్యతో కలిసి ఫయాజ్ ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఫయాజ్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. భార్య కూలీ పనికి వెళుతోంది. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన ఫయాజ్ పనికి వెళ్లడంలేదు. డబ్బుల కోసం వ్యభిచారం చేయాలని భార్యను వేధిస్తున్నాడు. తన స్నేహితులు, మయన్మార్‌కు చెందిన కమల్(30), ముజీబ్(31), రెహమాన్ అలియాస్ ఇబ్రహీం(29) వద్ద డబ్బు తీసుకొని ఇంటికి తీసుకెళ్లాడు. ఆ ముగ్గురితో గడపాలని భార్యపై ఒత్తిడి చేశాడు. తిరస్కరించిన ఆమెపై ఆ ముగ్గురితో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత ఇంట్లోనే ఆమెను బంధించి.. కొన్నాళ్లుగా ఆ ముగ్గురు స్నేహితులతో కలిసి ఆమెపై అత్యాచారం చేస్తున్నాడు. ఈనెల 23న భార్యను ఫయాజ్ ఇంట్లోనే బంధించి బయటనుంచి తాళం వేసి వెళ్లిపోయాడు. 26న ఇంటి అద్దెకోసం యజమాని, ఇంటివద్దకు రాగా లోపలి నుంచి ఏడ్పు వినిపించింది. స్థానికులతో కలిసి ఆయన తాళం పగలగొట్టి ఆమెను రక్షించాడు. వెంటనే ఆమె బాలాపూర్‌లో ఉంటున్న మయన్మార్‌కు చెందిన తన స్నేహితురాలి భర్త అబ్దుల్ జహీర్

సహకారంతో వారి ఇంటికి వెళ్లిపోయింది. తనపై జరిగిన దారుణంపై ఆమె సోమవారం కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త ఫయాజ్, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కమల్, ముజీబ్, రెహమాన్‌ను అరెస్టు చేశారు. భర్త ఫయాజ్ పరారీలో ఉన్నట్లు సీఐ బాలరాజు తెలిపారు.

ఉద్యోగం నుంచి తొలగించారని సెక్యూరిటీ గార్డు కక్ష

ఐదేళ్ల బాలిక దారుణ హత్య

కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్

నిందితుడు బిహార్ వాసి విక్రమ్‌గా గుర్తింపు

సెక్యూరిటీ గార్డు ఉద్యోగం నుంచి తొలగించారన్న కక్షతో ఓ యువకుడు ఐదేళ్ల చిన్నారిని పాశవికంగా హత్య చేశాడు. అందరూ బతుకమ్మ వేడుకల్లో ఉండగా ఆ గేటెడ్ కమ్యూనిటీలోకి ప్రవేశించిన ఆ దుర్మార్గుడు.. చిన్నారి కాళ్లు చేతులు కట్టేసి.. మెడకు ఉరి బిగించి.. నడుముకు రాయి కట్టి.. అదే ఆవరణలోని నీటి సంపులో పడేసి వెళ్లిపోయాడు. సాయంత్రం ఈ దారుణానికి ఒడిగట్టిన రాక్షసుడు.. అర్ధరాత్రి దాటాక ఫోన్ చేసి.. ఆ పాపను తానే కిడ్నాప్ చేశానని, విడిచిపెట్టాలంటే రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరకు తెల్లవారుజామున చిన్నారి మృతదేహాన్ని సంపులో గుర్తించారు. హైదరాబాద్‌లోని బొల్లారంలో ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బిహార్ నుంచి బతుకుతెరువు కోసం వచ్చిన విక్రమ్ అనే యువకుడికి గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్.. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం ఇచ్చింది. అతను నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నందుకు అసోసియేషన్‌లోని అరుళ్‌దాస్ అనే పెద్దాయన మందలించారు. అయినా పద్ధతి మారకపోవడంతో అసోసియేషన్ సభ్యులు అతన్ని తొలగించారు. తన ఉద్యోగం పోవడానికి అరుళ్‌దాసే కారణమని కక్ష పెంచుకున్న విక్రమ్.. ఆయన మనుమరాలిని హత్య చేశాడు. భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన అరుళ్‌దాస్ సింగరేణిలో పనిచేసి రిటైరయ్యారు. ఆయన కుమారుడు మిల్టన్ ఫెర్నాండెజ్, కోడలు డేజీ ఇవాంజిల్, వారి కుమారుడు జెడెన్ ఫెర్నాండెజ్, కుమార్తె అరేలియా (5)తో కలిసి కొకూరులోని విల్లాస్ ఆర్కిడ్స్‌లో ప్లాట్ నం.84లో 2019 నుంచి ఉంటున్నారు.

మిల్టన్ ఫెర్నాండెజ్ పత్తి విత్తనాల కంపెనీలో సైంటిస్టుగా పనిచేస్తుండగా డేజీ ఇవాంజిల్ దేవరయాంజల్‌లోని ప్రముఖ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. జెడెన్ ఫెర్నాండెజ్,

అరెలియా మోసెస్ అల్వాల్‌లోని సెయింట్ పాయిస్ పాఠశాలలో 7వ తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. దసరా సెలవులు కావడంతో జెడెన్ ఫెర్నాండెజ్ అరేలియాతో పాటు మరో నలుగురు చిన్నారులు విల్లా ఆర్కిడ్స్‌లోని క్లబ్ హౌస్ మెట్ల వద్ద సైకిల్ తొక్కుకుంటూ ఆడుకుంటున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విక్రమ్ నడుచుకుంటూ వచ్చి గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులతో మాట్లాడాడు. తాను తిరిగి డ్యూటీలో చేరతానని, లోపలికి వెళ్లి అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి బతిమిలాడి వస్తానని వెళ్లాడు. ఆ సమయంలో అందరూ క్లబ్ హౌస్ వెనకాల బతుకమ్మ సంబురాల్లో బిజీగా ఉన్నారు. అరేలియాను అక్కడే అడుకోవాలని, తాను సైకిల్‌పై ఒక రౌండు వేసొస్తానని చెప్పి అన్నయ్య జెడెన్ వెళ్లాడు. సరిగ్గా అదే సమయానికి వచ్చిన విక్రమ్.. అరేలియాను కిడ్నాప్ చేశాడు. చాలా సమయం గడిచినా అరేలియా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతకడం మొదలుపెట్టారు. వారి ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు వచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ గుర్తుతెలియని నంబర్ నుంచి దుండగుడు అరుళ్ధ?సకు ఫోన్ చేశాడు. హిందీలో మాట్లాడుతూ అరేలియాను కిడ్నాప్ చేశామని, అప్పగించాలంటే రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సెక్యూరిటీ గార్డులను నిలదీయడంతో విక్రమ్ లోపలికి వచ్చాడని క్లబ్ హౌస్ సెల్లార్ నీటి సంపు వద్ద అరేలియా ఉందని చెప్పి ఆటోలో పరారయ్యాడని చెప్పారు. అక్కడికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్న అలేరియా కనిపించింది. కాగా, నిందితుడు విక్రమ్‌ను మల్కాజిగిరి ఎస్‌వోటి పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై తొమ్మిదేళ్లుగా లైంగిక దాడి

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి అరెస్టు

తనకు పెళ్లైన విషయాన్ని దాచి, భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మరో మహిళతో పరిచయం పెంచుకున్న ఓ సీఐ.. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తొమ్మిదేళ్లుగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి ప్రస్తావన తెచ్చిన ప్రతిసారీ ఏదో ఒక సాకుతో దాటవేస్తుండటంతో విసిగిపోయిన ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నిందితుడు బాలస్వామిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లాకు చెందిన బాధిత మహిళకు 2008లో సాయికుమార్ అనే వ్యక్తితో వివాహం

జరిగింది. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆమెకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగం రావడంతో వారు 2009లో హైదరాబాద్‌కు వచ్చి సైదాబాద్‌లో నివాసముంటున్నారు. ఈ క్రమంలో 2015లో సాయికుమార్ ఓ ప్రమాదానికి గురై వెన్నుముక విరిగి మంచానికే పరిమితమయ్యాడు. విధుల్లో భాగంగా ఓ పని నిమిత్తం 2016 డిసెంబర్‌లో సదరు మహిళ చంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్‌కు వెళ్లింది. ఆ సమయంలో అక్కడ అడ్మిన్ ఎస్సైగా ఉన్న బాలస్వామి.. ఆ మహిళతో పరిచయం పెంచుకున్నాడు. తర్వాత ఆమెకు తరుచూ ఫోన్‌చేసి మాట్లాడటం ప్రారంభించాడు. తాను అవివాహితుడనని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అప్పుడు మంచాన పడ్డ తన భర్త గురించి బాధితురాలు చెప్పింది. ఆయన ఎక్కువ రోజులు బతకడని వైద్యులు చెప్పిన నేపథ్యంలో ఆమె కూడా అతడిని పెళ్లి చేసుకోవడానికి ఒప్పుకొంది. తనకు దివ్యాంగురాలైన సోదరితో పాటు.. కొన్ని వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని త్వరలోనే వాటిని పరిష్కరించుకొని పెళ్లిచేసుకుంటానని ఎస్సై బాలస్వామి షరతు పెట్టడంతో బాధిత మహిళ అందుకు అంగీకరించింది. ఈ క్రమంలో ఇద్దరు శారీరకంగా దగ్గరయ్యారు. బాలస్వామికి గతంలోనే పెళ్లైనట్లు బాధితురాలికి తెలిసి అతడిని నీలదీయగా.. తన భార్యతో తీవ్రమైన గొడవలు జరుగుతున్నాయని, విడిపోయి విడిగా ఉంటున్నామని, త్వరలోనే విడాకులు తీసుకుంటామని నమ్మబలికాడు. అయినా బాధితురాలు అతన్ని దూరం పెట్టడంతో ఆవేదనకు గురైన బాలస్వామి.. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసి మళ్లీ దగ్గరయ్యాడు.

2021లో బాధితురాలి భర్త మరణించడంతో ఆమెతో సహజీవనం కొనసాగించాడు. ఆ తర్వాత 2025 జనవరి నుంచి తనను క్రమంగా దూరం పెట్టడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన బాధితురాలు.. సైదాబాద్ పోలీసులను ఆశ్రయించింది. ఇన్నేళ్లు తనను శారీరకంగా వాడుకుని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బాలస్వామిని అదుపులోకి తీసుకున్నారు. డీఐ బాలస్వామి గతమంతా వివాదాస్పదమేనని శాఖలో చర్చించుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ వచ్చిన తర్వాత ఆయన భవానీనగర్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ మరో మహిళతో వివాదం జరగ్గా, ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దాంతో అతడిని ఎస్‌హెచ్‌వో నుంచి తప్పించి ఖైరతాబాద్ డీఐగా బదిలీ వేటు వేశారు. ఇక్కడికి వచ్చిన 8 నెలల్లోనే తాజా వివాదం వెలుగులోకి వచ్చింది. బాలస్వామిని నేడో, రేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మంత్రాల నెపంతో తల్లిని సహజీవనం చేసిన కుమారుడు

గ్రామంలో మరణాలకు తన తల్లి చేసిన మంత్రాలే కారణమని నమ్మిన ఆమె తనయుడు... ఆమెను అంతం చేస్తేనే మరణాలు ఆగుతాయన్న ఆలోచనతో పెట్రోల్ పోసి సజీవదహనం చేశాడు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం ఎల్లుపేటలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్రె సాయవ్వ(40) కూలి చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించగా, కుమారుడు దుర్గేశ్ హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. దుర్గేశ్.. కొన్నాళ్లుగా స్వగ్రామానికి వచ్చి ఉంటున్నాడు. తల్లి సాయవ్వ మంత్రాలు చేయడం వల్లే ఇటీవల గ్రామంలో కొందరు చనిపోయారని అనుమానించిన దుర్గేశ్.. రెండు రోజుల క్రితం ఆమెతో గొడవ పడ్డాడు. గ్రామంలో పెద్ద మనుషుల పంచాయితీ పెట్టి.. ఇదే విషయం చెప్పాడు. దీంతో పెద్దలు సైతం అతడిని మందలించారు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చిన దుర్గేశ్.. సాయవ్వపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కాలిన గాయాలతో ఆమె అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలిక ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

కుప్పిలి పంచాయతీ యాతపేట గ్రామానికి చెందిన ముంత గీత (17) అనే బాలిక ఈ నెల 9 తేదీన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డింది. ఈ సంఘటనపై గీత తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎచ్చెర్ల ఎస్‌ఐ జి.లక్ష్మణరావులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు మండలం కేశవరాయునిపాలెం గ్రామానికి చెందిన నాయని శ్రీరామ్ ప్రేమిస్తున్నానని వెంటపడి...ఆ ప్రేమను అంగీకరించకపోతే చనిపోతానని బెదిరించాడు. ఈ క్రమంలో ఆమెకు తెలియకుండా ఫొటోలు తీశాడు. బాలిక కుటుంబంతో విభేదాలు ఉన్న అదే గ్రామానికి చెందిన పెంటమాని సురేష్, శ్రీరామ్ నుంచి ఆ ఫొటోలు తీసుకున్నాడు. ఆమె కుటుంబాన్ని అగౌరవపర్చాలన్న ఉద్దేశంతో తన తమ్ముడు పెంటమాని జోష్ సాయంతో ఆ గ్రామంలోని కుర్రాళ్ల వాట్సాప్‌నకు ఫొటోలు పంపించాడు. ఈ విషయం

తెలియడంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో నిందితులు నాయని శ్రీరామ్, పెంటమాని సురేష్, పెంటమాని జోష్‌లను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

ప్రేమ, పెళ్లి పేరుతో థాయ్ మహిళను మోసగించిన ఘనుడు

రూ.60 లక్షలు వసూలు.. పోలీసుల అదుపులో నిందితుడు

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యాపారి ప్రేమ, పెళ్లి పేరుతో థాయ్‌లాండ్‌కు చెందిన మహిళను మోసం చేయడం కలకలం రేపుతోంది. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వారిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆపై థాయ్‌లాండ్‌కు వెళ్లిన ఆ వ్యక్తి మహిళను వివాహం చేసుకున్నాడు. ఆమె నుంచి లక్షల రూపాయల నగదు వసూలు చేశాడు. రెండేళ్లు గడిచిన తర్వాత ఒక్కసారిగా భార్యను వదిలేసి భారత్‌కు వచ్చేశాడు. భర్తను వెతుక్కుంటూ భారత్‌కు వచ్చిన మహిళకు అతని గురించి షాకింగ్ విషయాలు తెలిశాయి. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది.

థాయ్‌లాండ్‌కు చెందిన అప్సోర్న్ అనే మహిళ రెస్టారెంట్ నిర్వహిస్తోంది. సోషల్ మీడియా ద్వారా ఆమెకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన తోలు వ్యాపారి ఇర్ఫాన్‌తో పరిచయం ఏర్పడింది. వారి స్నేహం కాస్తా కొన్ని నెలల్లోనే ప్రేమగా మారింది. అనంతరం రెండేళ్ల కిందట థాయ్‌లాండ్‌కు ఇర్ఫాన్ వెళ్లాడు. తన కోసమే వచ్చానని చెప్పి అప్సోర్న్‌ను అక్కడే వివాహం చేసుకున్నాడు. వారి పెళ్లి తర్వాత ఇర్ఫాన్ వ్యాపార, ఇతర ఆర్థిక అవసరాల నిమిత్తం ఆమె నుంచి డబ్బులు వసూలు చేయడం మొదలెట్టాడు. భర్తను నమ్మిన మహిళ.. తన రెస్టారెంట్ ద్వారా వచ్చిన ఆదాయం సహా బంధువుల నుంచి అప్పుగా తీసుకుని దాదాపు రూ.60 లక్షలు ఇచ్చింది. అయితే, కొన్ని రోజులకే ఆమెతో తెగతెంపులు చేసుకుని భారత్‌కు ఇర్ఫాన్ వచ్చేశాడు. అయితే, నెలలు గడుస్తున్నా భర్త నుంచి సమాచారం అందకపోవడంతో అతన్ని వెతుక్కుంటూ 2026 అక్టోబర్ 6న భారత్‌కు అప్సోర్న్ వచ్చింది. కాన్పూర్‌లోని ఇర్ఫాన్ ఇంటికి చేరుకోగా.. ఆమెకు షాకింగ్ విషయాలు తెలిశాయి. అతడికి 12 ఏళ్ల కిందటే వివాహం అయ్యిందని, ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారని తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. తనను మోసం చేశావని అతడిపై ఆగ్రహిస్తూ డబ్బును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో సదరు మహిళపై దాడి చేయడమే కాకుండా.. తనతో

ఉండాలన్నా, డబ్బు తిరిగి ఇవ్వాలన్నా మతం మారాలని ఇర్ఫాన్ చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించగా.. కేసు నమోదు చేసి నిందితుడు ఇర్ఫాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

కాంగ్రెస్ ఎంపీపై లైంగిక వేధింపుల ఆరోపణలు

ప్రొఫెసర్ కొలువు నుంచి తొలగించిన జెఎన్‌యూ

లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.ఆంగోంచా బిమోల్ అకోయిజమ్‌పై వేటు పడింది. యూనివర్సిటీలోని అంతర్గత కమిటీ విచారణ అనంతరం.. ఆయన్ను దోషిగా తేలుస్తూ, విధుల నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. ఈ మేరకు జేఎన్‌యూ వీసీ, ప్రొఫెసర్ శాంతిశ్రీ డి.పండిట్ ఆయన్ను తొలగిస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. మణిపుర్‌లోని ఇన్నర్ మణిపుర్ లోక్‌సభ ఎంపీ అయిన అకోయిజమ్.. తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని 11 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తరగతి గదుల్లో అనుచిత వ్యాఖ్యలు చేయడం, సమావేశాల్లో అసౌకర్యానికి గురిచేసేలా ప్రవర్తించడం, విద్యాపరమైన పరస్పర చర్యల సమయంలోనూ అనుచితంగా ప్రవర్తించారంటూ ఆయనపై ఆరోపణలు చేశారు. తొలుత ఓ విద్యార్థిని వైవా పరీక్షల అనంతరం తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించగా.. ఆ తర్వాత మరికొందరు విద్యార్థినులూ ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. అయితే.. తనపై వచ్చిన ఆరోపణలను అకోయిజమ్ ఖండించారు. అవి నిరాధారమైనవన్న ఆయన.. ఉద్దేశపూర్వకంగా తనపై అభియోగాలు మోపుతున్నారని చెప్పుకొచ్చారు. మరోవైపు.. ఆకోయిజమ్ రాజీనామాను కోరుతూ ఏబీవీపీ ఆందోళనలు నిర్వహించింది. ఈ నిరసనలపై స్పందించిన ఢిల్లీ మహిళా కమిషన్ కూడా జేఎన్‌యూ యాజమాన్యాన్ని నివేదిక కోరినట్టు సమాచారం.

మహిళపై సామూహిక అత్యాచారం

తన భర్తతో మరో మహిళ ఉండడాన్ని తట్టుకోలేక ఓ వివాహిత దారుణానికి ఒడిగట్టింది. ఆమెపై అత్యాచారం చేయించేందుకు ఓ గ్యాంగ్‌ను పురమాయించింది. కేరళంలో గత నెల

జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఓ మహిళ తన ప్రియుడితో కలిసి కేరళంలోని త్రిస్సూర్‌కు వెళ్లింది. అక్కడ ఇద్దరూ సిటీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ లాడ్జ్‌లో ఏకాంతంగా గడిపారు. అయితే కొంతసేపటి తరువాత ఐదుగురు వ్యక్తులు పోలీస్ దుస్తులతో వచ్చి వీరిని బెదిరించారు. ఆ తరువాత వీరిద్దరి కాళ్లు, చేతులు కట్టేసి.. తమిళనాడుకు తీసుకువెళ్లేందుకు బలవంతంగా కారులో ఎక్కించారు. దారిలో ప్రియుడిపై నకిలీ పోలీసులు దారుణంగా దాడికి పాల్పడ్డారు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కొన్ని గంటల అనంతరం అతన్ని ఓ ఆసుపత్రి ముందు దించేసి వెళ్లిపోయారు. కానీ.. ఆ మహిళను మాత్రం వదల్లేదు. మరోచోటకు తీసుకెళ్లి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన తరువాత బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ప్రియుడి భార్యే ఈ దారుణానికి ఒడిగట్టినట్టు పోలీసులు గుర్తించారు. తన భర్త మరో మహిళతో ఉండడాన్ని తట్టుకోలేక ఆమె ఇలా చేయించిందని దర్యాప్తులో తేలింది. భర్త ప్రియురాలిపై అత్యాచారం చేయాలని భార్యే ఓ గ్యాంగ్‌కు పురమాయించిందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆమెతో పాటు మరో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

కట్నం వేధింపులతో గర్భిణి ఆత్మహత్య

ములుగు జిల్లాలోని ఏటూరునాగారం రోహిర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. నాలుగు నెలల గర్భిణి స్వర్ణలత (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అదనపు కట్నం, భూమి విషయంలో భర్త, అత్త, మామ కొంతకాలంగా స్వర్ణలతను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపుల కారణంగానే ఆమె తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పరిస్థితి విషమించడంతో ఆమెను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం. స్వర్ణలత మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్వర్ణలత భర్త, అత్త, మామపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అదనపు కట్నం, భూమి విషయంలో వేధింపులు జరిగాయన్న ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వైద్య విద్యార్థిని అనుమానాస్పద మృతి

ప్రియుడిని కలిసేందుకు వచ్చి.. హోటల్‌లో శవమై తేలిన యువతి

హైదరాబాద్‌లోని మియాపుర్‌లో ఘటన

ప్రియుడి వద్ద ఉన్న తన బంగారు గొలుసును తీసుకునేందుకు వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ వైద్య విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఓ హోటల్ రూములో శవమై కనిపించింది. ఈ ఘటన మియాపూర్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన కోమటి భూమయ్య రెండో కుమార్తె కోమటి సృజన.. మహబూబ్‌నగర్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి, వరంగల్‌లో పీడియాట్రిషన్ విభాగంలో పీజీ మొదటి ఏడాది చదువుతోంది. ఆమెకు ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలోనే మహబూబ్‌నగర్ జిల్లా అత్మకూరు ప్రాంతానికి చెందిన రవి (30)తో పరిచయం ఏర్పడింది. ఈ సమయంలో సృజన అతడికి బంగారు గొలుసు ఇచ్చింది. ఇద్దరి మధ్య ఇప్పుడు దూరం పెరగడంతో తన గొలుసు తిరిగి ఇచ్చేయమని కోరగా.. రవి మియాపూర్‌కు రమ్మని చెప్పాడు. దీంతో సెప్టెంబరు 30న సృజన వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. అప్పటికే రవి సెప్టెంబరు 29 నుంచి మియాపూర్‌లోని ఓ హోటల్‌లో రూము తీసుకుని ఉంటుండడంతో అతడి వద్దకు వచ్చింది. ఈనెల 1న రూము నుంచి రవి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా సృజన ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఆమె తండ్రి వరంగల్‌కు వెళ్లి ఆరా తీసి, అక్కడే మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు మొబైల్ సిగ్నల్ ఆధారంగా సృజన.. మియాపూర్‌లోని ఓ హోటల్‌లో ఉన్నట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. మియాపూర్ పోలీసులు హోటల్ రూముకు వెళ్లి చూడగా.. సృజన మంచంపై నిర్జీవంగా పడిఉంది. ఆమె ముఖం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. రెండు రోజుల క్రితమే ఆమె చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, ఆమె తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

ఇన్‌స్టాలో పరిచయమైన బాలికపై అత్యాచారం

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన 16 ఏళ్ల బాలికకు ప్రేమ పేరుతో దగ్గరై, పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన ఓ బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్న బాలుడికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాధితురాలు పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారగా

ఇరువురు చాలాసార్లు బయట కలుసుకున్నారు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆ బాలికపై బాలుడు పలుమార్లు అత్యాచారం చేశాడు. కొంతకాలం తర్వాత ఆ బాలుడు ముఖం చాటేశాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సదరు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

విజయవాడలో ప్రియురాలి హత్య.. ప్రియుడు ఆత్మహత్య

ఇద్దరూ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.. ఇరు కుటుంబాల మధ్య పెళ్లి సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో.. ఆ యువకుడిలో అనుమానపు పిశాచి కారణంగా చిచ్చురేగింది. కలిసి బతకాల్సిన తరుణంలో.. ప్రాణంగా ప్రేమించిన యువతిని హత్య చేసి.. ఆమె ఇంటి వద్దే తనూ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆమె గొంతు కోసి చంపేశాక.. అదే ఇంటి మేడపైకెక్కి కిందికి దూకేసి మృతి చెందాడు. ఈ విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లో జరిగింది. ఇక్కడి న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన పడాల మహాలక్ష్మి(19) రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్లలో నాన్నమ్మ శాంతమ్మ వద్ద ఉంటూ.. పంజా సెంటర్‌లోలోని ఓ వస్త్రదుకాణంలో పని చేస్తోంది. శ్రీకాకుళం జిల్లా గుప్పిడిపేటకు చెందిన మక్కు చిన్నారావు(22) అదే అపార్టుమెంట్లలోని సీ బ్లాక్ ఉంటున్న తన అన్నయ్య మహేశ్ వద్ద ఉంటున్నాడు. అతడు శుభకార్యాల్లో మండపాలకు డెకరేషన్ చేస్తుంటాడు. పనులు ఉన్నప్పుడు అన్నయ్య వద్దకు వస్తుంటాడు. మహాలక్ష్మి, చిన్నారావు.. పక్కపక్క బ్లాక్‌ల్లో ఉండడంతో పరిచయం ఏర్పడింది. రెండేళ్లకు పైగా ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కొద్దిరోజుల క్రితం చిన్నారావు ఇంట్లో చెప్పాడు. దీంతో అతడి కుటుంబ సభ్యులు మహాలక్ష్మి కుటుంబంతో సంప్రదింపులు చేశారు. ఈక్రమంలో ఇటీవల జరిగిన వినాయక నిమజ్జన ఊరేగింపులో మహాలక్ష్మి వేరొకరితో కలిసి డ్యాన్స్ చేసింది. దీనిపై చిన్నారావు అనుమానం వ్యక్తం చేశాడు. ఇద్దరి మధ్య దూరం పెరిగింది. చిన్నారావు మెసేజ్‌లు చేస్తున్నా ఆమె స్పందించడం లేదు. దీంతో ఆమెపై పగ పెంచుకున్న చిన్నారావు ఇంటి నుంచి కొబ్బరిబొండాలు కొట్టే కత్తి తీసుకుని మహాలక్ష్మి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంటి బయట వంట సామగ్రిని శుభ్రం చేస్తున్న ఆమె గొంతుకోశాడు. ఆ సమయంలో ఆమె నాన్నమ్మ టిఫిన్ తెచ్చుకోవడానికి హోటల్‌కు వెళ్లింది. మహాలక్ష్మి గొంతు కోసిన తర్వాత అదే అపార్టుమెంట్‌పైకి ఎక్కి కిందికి దూకేశాడు. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. కొన ఊపిరితో ఉన్న మహాలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికి ప్రాణాలు కోల్పోయింది. అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తను హతమార్చి పాముకాటుగా చిత్రీకరణ

మీరట్‌లో భార్య, ప్రియుడికి మరణశిక్ష!

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో సంచలనం సృష్టించిన భర్త హత్య కేసులో స్థానిక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను గొంతునులిమి చంపి, ఆ హత్యను పాముకాటుగా చిత్రీకరించేందుకు యత్నించిన భార్య రవిత, ఆమె ప్రియుడు అమర్‌దీప్‌లకు కోర్టు మరణశిక్ష ఖరారు చేసింది. నేరం జరిగిన ఏడాదిన్నరలోపే న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించడం గమనార్హం. బహుసుమ ప్రాంతంలోని అక్బర్‌పూర్ సాదత్ గ్రామానికి చెందిన అమిత్ కశ్యప్‌ను 2025 ఏప్రిల్ 12 రాత్రి అతని భార్య రవిత, ప్రియుడు అమర్‌దీప్ కలిసి గొంతు నులిమి హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహంపై ఒక పామును వదిలిపెట్టి.. అతను పాముకాటు వల్లే మరణించాడని నమ్మించేందుకు నాటకమాడారు. అయితే పోస్టుమార్టం నివేదికలో అమిత్‌ది హత్యేనని తేలడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలించారు. హత్య జరిగిన రోజునే ఆ ఇద్దరూ 50 సార్లు ఫోన్లో మాట్లాడుకున్నట్లు తేలింది. మరోవైపు శిక్ష ఖరారు చేసే ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు.. దోషులను సంప్రదించింది. తమ పిల్లలను, వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాలని కోరుతూ రవిత, అమర్‌దీప్‌లు న్యాయమూర్తి ముందు కన్నీరుమున్నీరుగా విలపించారు. దర్యాప్తులో భాగంగా 60 రోజుల్లోనే పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. 12 మందికి పైగా సాక్షులను విచారించిన న్యాయస్థానం అక్టోబర్ 7న వారిని దోషులుగా తేల్చి.. తాజాగా మరణశిక్ష విధించింది. మీరట్‌లో ఇటీవల బ్లూ డ్రమ్ హత్య కేసులోనూ మరణశిక్ష పడటం గమనార్హం. అలానే గత మూడు రోజుల్లో మీరట్‌లో నలుగురు దోషులకు మరణశిక్ష పడింది.

ప్రియురాలిని సజీవ దహనం చేసిన ప్రియుడు

కేరళలో దారుణం చోటుచేసుకుంది. తన మాజీ ప్రియురాలిని ఓ యువకుడు అత్యంత దారుణంగా హత్య చేశాడు. గొంతు నులిమి, రాయితో కొట్టి.. దారుణంగా చంపేశాడు. అనంతరం, మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టాడు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని బోడిన ప్రాంతానికి చెందిన నిత్య (18), రాజకుమారి ప్రాంతానికి చెందిన నిశాంత్ (19) 2023 నుంచి ప్రేమలో ఉన్నారు. అయితే ఇటీవల కొన్ని కారణాల వల్ల

వీరిద్దరూ విడిపోయారు. కొద్ది రోజుల క్రితం నిశాంత్ నిత్యకు ఫోన్ చేసి మాట్లాడాలని, పూపాడ ప్రాంతానికి రావాలని కోరాడు. అతడి మాటలు నమ్మి పూపాడలోని ఒక తేయాకు తోటకు నిత్య వెళ్లింది. ఈ సందర్భంగా కాసేపు మాట్లాడుకున్న తర్వాత వారి సంభాషణ వాగ్వాదానికి దారితీసింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన నిశాంత్.. నిత్యను గొంతు నులిమి అనంతరం బండరాయితో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. అంతటితో ఆగకుండా పోలీసులు దొరక్కుండా ఉండేదుకు మృతదేహాన్ని తన ఆటోరిక్షాలో ఎక్కించుకుని పాంబ్లా డ్యామ్ ప్రాంతానికి తరలించాడు. అక్కడ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మృతదేహంపై పోసి నిప్పుంటించాడు. మరుసటి రోజు డ్యామ్ సమీపంలో గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు ప్రారంభించారు. హత్య అనంతరం నిందితుడు నిశాంత్ తన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యాడు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గాలించిన పోలీసులు రాజకుమారి ప్రాంతంలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

కూతురిపై లైంగిక వేధింపులు.. భర్తను హత్య చేసిన భార్య

కేరళలోని కొచ్చిలో ఓ షాకింగ్ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. తన 16 ఏళ్ల కుమార్తెపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడనే ఆరోపణతో తన భర్తను ఓ మహిళ హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని రైల్వే ట్రాక్ సమీపంలో పడేసింది. మొదట రైలు ప్రమాదంగా భావించారు. అయితే అక్కడి పరిస్థితులు అనుమానాస్పదంగా ఉండడంతో విచారణ జరిపి అతడి భార్యను అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 17 తెల్లవారుజామున ఎర్నాకుళం దగ్గర ట్రాక్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని రైలు లోకో పైలట్ గుర్తించారు. వెంటనే రైల్వే రక్షణ దళానికి సమాచారం అందించారు. రైలు ఢీకొనడం వల్లే ఆ వ్యక్తి చనిపోయినట్లు తొలుత భావించారు. అయితే ప్రాథమిక పరిశీలనలో పోలీసులకు అనుమానాలు కలిగాయి. దీంతో మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి, మృతుడి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో మృతుడు ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆయన కుటుంబం కొచ్చిలో నివసిస్తున్నట్లు పోలీసులకు తెలిసింది. కుటుంబ సభ్యులను విచారిస్తున్న సమయంలో భార్య చెప్పిన వివరాల్లో పొంతన లేకపోవడంతో పోలీసులు ఆమెపై అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. చివరకు తానే తన భర్తను చంపినట్టు ఆమె అంగీకరించింది. తన మొదటి వివాహం ద్వారా కలిగిన 16 ఏళ్ల

కుమార్తెపై భర్త లైంగిక వేధింపులకు ప్రయత్నించాడని, ఈ కారణంగానే అతడిపై దాడి చేసినట్లు ఆమె చెప్పింది. దీంతో పోలీసులు బాధిత బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

20మంది మహిళా కానిస్టేబుళ్లకు టోకరా

పెళ్లి పేరుతో రూ.24 లక్షలు కాజేసిన కేటుగాడు!

పెద్ద పెద్ద రెస్టారెంట్లు, ఖరీదైన కార్లలో తిరగడం వంటి విలాసవంతమైన జీవనశైలి ఉన్నట్లుగా కనిపించే ఫొటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం.. పెద్ద వ్యాపారవేత్తగా కనిపిస్తూ.. ఓ కేటుగాడు మహిళా కానిస్టేబుళ్లతో పరిచయం పెంచుకుని మోసం చేశాడు. ఢిల్లీకి చెందిన విక్రాంత్ తోమర్ అనే యువకుడు పెళ్లి పేరుతో దాదాపు 20 మంది మహిళా కానిస్టేబుళ్ల నుంచి రూ.24 లక్షల వరకు మోసం చేశాడు. కరోల్ బాగ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ దారుణం బయటబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలోని బురారి ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల విక్రాంత్ తోమర్ అనే యువకుడు సోషల్ మీడియాను అస్త్రంగా మలుచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో విలాసవంతమైన కార్లు, రిచ్ లైఫ్‌స్టైల్‌కు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ తను ఒక పెద్ద వ్యాపారవేత్తనని నమ్మబలికాడు. ఢిల్లీ పోలీసు శాఖలో పనిచేస్తున్న ఒకే బ్యాచ్‌కు చెందిన మహిళా కానిస్టేబుళ్లను తన టార్గెట్‌గా ఎంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వారి నుంచి విడతల వారీగా రూ. 24 లక్షల వరకు కాజేశాడు. ఇక్కడ అసలు ట్విస్ట్ ఏమిటంటే... నిందితుడు విక్రాంత్ తోమర్ సహజీవనం చేస్తున్న మహిళ కూడా ఢిల్లీ పోలీసు శాఖలోనే కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఆమె ద్వారానే తన బ్యాచ్‌కి చెందిన తోటి మహిళా కానిస్టేబుళ్ల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 20 మంది మహిళా కానిస్టేబుళ్లను ఇతను టార్గెట్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే వీరిలో కొందరు మాత్రమే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి వసూలు చేసిన డబ్బును 'వన్-ఎక్స్' బెట్టింగ్ యాప్‌తో అనుసంధానించిన ఖాతాలకు మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై ఇప్పటికే మాయాపురి, హరి నగర్, ఇందర్‌పురి తదితర ప్రాంతాల్లో ఐదు ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లోనే అతను బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ సెంట్రల్ జిల్లా సైబర్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, పరువు పోతుందనే భయంతో మరికొందరు బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదని పోలీసులు పేర్కొన్నారు.

మహిళల అసభ్యకర ఫొటోలు, వీడియోల కోసం స్నేహితుడి హత్య

ఇద్దరు నిందితుల అరెస్టు

సాంబమూర్తినగర్ ఇందిరాకాలనీలో ఈ నెల 2న జరిగిన గండి గిరిధర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. గిరిధర్‌ను పాలేపు వివేక్ (18), ఏలూరి రామకృష్ణ (21) హత్య చేసినట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. మృతుడు గిరిధర్‌కు నిందితులు వివేక్, రామకృష్ణ స్నేహితులు. అయితే, ఇటీవల గిరిధర్ తన సెల్‌ఫోన్‌లో ఉన్న కొంతమంది మహిళలకు సంబంధించిన అభ్యంతరకర ఫొటోలు, వీడియోలను నిందితులకు చూపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారిద్దరూ వాటిని తమకు ఇవ్వాలని గిరిధర్‌పై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. ఆ ఫొటోలు, వీడియోలను తీసుకుని సంబంధిత మహిళల కుటుంబ సభ్యులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని వివేక్, రామకృష్ణ పథకం వేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో గిరిధర్‌తో వారు గొడవకు దిగారు. ఫొటోలు, వీడియోలు ఇచ్చేందుకు గిరిధర్ నిరాకరించడంతో అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పథకం ప్రకారం ఈ నెల 2న ముందుగానే తీసుకెళ్లిన కత్తితో గిరిధర్‌పై వివేక్, రామకృష్ణ దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం అతడి సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ హత్య స్థానికంగా పెను సంచలనంగా మారడంతో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు గిరిధర్ నుంచి లాక్కున్న సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆయుష్‌లో లైంగిక వేధింపులపై మెజిస్టీరియల్ విచారణ

ఆయుష్ విభాగంలో అధికారినిని విశాఖపట్నం ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

లైంగికంగా వేధించారని అందిన ఫిర్యాదుపై ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. అధికారిక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నప్పుడు ఆ అధికారిణి తప్పనిసరి స్థితిలో ఆర్‌డీడీ కారు ఎక్కారు. ఆయన మార్గమధ్యంలో అభ్యంతరకరంగా ప్రవర్తించారు. దీనిపై ఆమె ఆయుష్ విభాగం ఉన్నతాధికారులకు, మానవ హక్కుల కమిషన్‌కు, మహిళా హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్‌డీడీపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో మరో మహిళకు ఇలా జరగకూడదని కోరారు. ఈ ఘటనను 'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రచురించడంతో ఆయుష్ డైరెక్టర్ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌ను మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మంజీరా నదిలో దూకిన తల్లి, ఇద్దరు కుమార్తెలు

మెదక్ జిల్లాలో విషాదం

మెదక్ జిల్లా ఏడుపాయల బ్రిడ్జి వద్ద మంజీరా నదిలో దూకి తల్లి, ఇద్దరు కుమార్తెలు గల్లంతయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందగానే పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన సరిత (25), తన కుమార్తెలు వైష్ణవి (5వ తరగతి), శ్రావణిక (4వ తరగతి) మంజీరా నదిలో దూకారు. హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా సరిత పనిచేస్తున్నారు. ఆధార్ కార్డు సవరణ కోసం మెదక్‌కు వచ్చి నదిలో దూకినట్లు సమాచారం. మంజీరా నదిలో దూకుతున్నట్లు సరిత తన బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఏడుపాయల వద్ద నది ఒడ్డున ముగ్గురి చెప్పులు, ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజఈతగాళ్లతో రెండు గంటల పాటు గాలించినా వారి ఆచూకీ దొరకలేదు. చీకటి పడటంతో అధికారులు తాత్కాలికంగా గాలింపు చర్యలను నిలిపివేశారు. ఉదయం నుంచి మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

భారతదేశంలో మానవ హక్కుల పరిరక్షణలో కీలక తీర్పులు

1. Maneka Gandhi vs Union of India (1978)

కేసు నేపథ్యం - ప్రభుత్వం మనేకా గాంధీ పాస్‌పోర్ట్‌ను సరైన కారణం చెప్పకుండా స్వాధీనం చేసుకుంది.

సుప్రీంకోర్టు తీర్పు - రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు మరియు వ్యక్తిగత స్వేచ్ఛ) అత్యంత విస్తృతమైన హక్కు అని పేర్కొంది.

ప్రాముఖ్యత -

జీవించే హక్కు అంటే కేవలం ప్రాణాలతో ఉండటం మాత్రమే కాదు.

గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా ఇందులో భాగం.

సహజ న్యాయం (Natural Justice) పాటించాలి.

2. Vishaka vs State of Rajasthan (1997)

కేసు నేపథ్యం - సామాజిక కార్యకర్త భన్వరీ దేవిపై జరిగిన లైంగిక దాడి నేపథ్యంలో ఈ కేసు వచ్చింది.

తీర్పు- ఉద్యోగ మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు సుప్రీంకోర్టు "విశాఖ మార్గదర్శకాలు" జారీ చేసింది.

ప్రభావం - 2013 POSH చట్టానికి ఈ తీర్పే పునాది.

ఉద్యోగస్థలంలో మహిళల భద్రతను మానవ హక్కుగా గుర్తించింది.

3. D.K. Basu vs State of West Bengal (1997)

కేసు నేపథ్యం - పోలీసు అదుపులో హింస, మరణాలపై ఆందోళన.

తీర్పు - అరెస్టు సమయంలో పోలీసులకు కచ్చితమైన మార్గదర్శకాలు విధించింది.

ముఖ్యాంశాలు - అరెస్టు మెమో తప్పనిసరి. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలి. వైద్య పరీక్షలు నిర్వహించాలి.

ప్రాముఖ్యత - కస్టడీయల్ టార్చర్ కూడా మానవ హక్కుల ఉల్లంఘనే అని స్పష్టం చేసింది.

4. Olga Tellis vs Bombay Municipal Corporation (1985)

కేసు నేపథ్యం - ఫుట్‌పాత్ వ్యాపారులను తొలగించే చర్యలను సవాలు చేశారు.

తీర్పు - జీవనోపాధి హక్కు (Right to Livelihood) కూడా ఆర్టికల్ 21లో భాగమని పేర్కొంది.

ప్రాముఖ్యత - పేదల జీవనోపాధిని రక్షించిన చారిత్రాత్మక తీర్పు.

5. Unni Krishnan vs State of Andhra Pradesh (1993)

తీర్పు - విద్య హక్కు మౌలిక హక్కులో భాగమని పేర్కొంది.

ప్రభావం - తర్వాత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21-A రూపంలో విద్యా హక్కు చట్టబద్ధమైంది.

6. People*μ*s Union for Civil Liberties (PUCL) vs Union of India

అంశం - టెలిఫోన్ ట్యాపింగ్ మరియు వ్యక్తిగత గోప్యత.

తీర్పు - ప్రైవసీ మానవ హక్కు అని పేర్కొంది.

వ్యక్తిగత సంభాషణలపై ప్రభుత్వం అనవసర జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది.

7. Justice K.S. Puttaswamy vs Union of India (2017)

చారిత్రాత్మక తీర్పు - సుప్రీంకోర్టు 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం:

Right to Privacy is a Fundamental Right అని ప్రకటించింది.

ప్రాముఖ్యత - వ్యక్తిగత గోప్యత, డిజిటల్ డేటా రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ - అన్నీ మానవ హక్కులలో భాగమని గుర్తించింది.

8. NALSA vs Union of India (2014)

తీర్పు - ట్రాన్స్‌జెండర్ వ్యక్తులను "మూడవ లింగం"గా గుర్తించింది.

ప్రభావం - సమానత్వ హక్కు, గౌరవప్రద జీవన హక్కు, వివక్ష రహిత హక్కు. ట్రాన్స్‌జెండర్ సమాజానికి రాజ్యాంగ పరిరక్షణను కల్పించింది.

9. Bandhua Mukti Morcha vs Union of India (1984)

అంశం - బానిస కార్మిక వ్యవస్థ.

తీర్పు - బలవంతపు శ్రమ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది.

ప్రాముఖ్యత - కార్మిక హక్కులను మానవ హక్కులతో అనుసంధానించింది.

10. Shayara Bano vs Union of India (2017)

అంశం - ట్రిపుల్ తలాక్.

తీర్పు - తక్షణ ట్రిపుల్ తలాక్ చెల్లదని సుప్రీంకోర్టు ప్రకటించింది.

ప్రాముఖ్యత - ముస్లిం మహిళల సమానత్వం, గౌరవం, మానవ హక్కులను బలోపేతం చేసింది.

NHRC తరచుగా ప్రస్తావించే ప్రధాన మానవ హక్కులు

జీవించే హక్కు (Right to Life)

గౌరవప్రద జీవితం (Right to Dignity)

వ్యక్తిగత స్వేచ్ఛ (Personal Liberty)

గోప్యత హక్కు (Privacy)

విద్య హక్కు (Education)


ఆరోగ్య హక్కు (Health)

మహిళల భద్రత - బాలల హక్కులు

కార్మిక హక్కులు

సమానత్వ హక్కు

వివక్ష రహిత హక్కు



భారత న్యాయవ్యవస్థ మానవ హక్కులను కేవలం రాజ్యాంగ నిబంధనలుగా కాకుండా, ప్రతి వ్యక్తి గౌరవప్రద జీవనానికి అవసరమైన హక్కులుగా అభివృద్ధి చేసింది. ముఖ్యంగా Maneka Gandhi, Vishaka, Puttaswamy, D.K. Basu వంటి తీర్పులు భారతదేశంలో మానవ హక్కుల న్యాయశాస్త్రానికి మైలురాళ్లుగా నిలిచాయి. ఇవి మహిళల భద్రత, గోప్యత, వ్యక్తిగత స్వేచ్ఛ, జీవనోపాధి మరియు మానవ గౌరవాన్ని రాజ్యాంగ పరిరక్షణలో స్థిరపరిచాయి.

డిజిటల్ మోసాలకు బ్యాంకులనే బాధ్యుల్ని చేయాలి

నష్టపరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి: సుప్రీంకోర్టు

డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ మోసాలు పెరుగుతున్న వేళ సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ మోసాల బాధితులకు నష్ట పరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని చెప్పింది. ఒకవేళ బ్యాంక్ తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలని ఆదేశించింది. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ కుంభకోణం అంశంపై సుమోటోగా విచారణ జరిపిన సీజేఐ జస్టిస్? సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.

డిసెంబర్ 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బీఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది.

ఖాతాదారుని నిర్ధరిత లావాదేవీల సరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్,

లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత ఏడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మేము ఆశ్చర్యపోతున్న విషయం ఏమిటంటే ప్రజలకు ఇంకా ఎందుకు అర్థం కావడం లేదు? బాధితులకు ఏమైంది? ఈ బాధితులు ఇలా ఎలా చిక్కుల్లో పడుతున్నారు? వారికి ఈ ప్రాథమిక విషయం అర్థం కావడం లేదా? మొబైల్‌లో అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మీడియాలో దీని గురించి అంతగా ప్రచారం జరుగుతోంది కదా! ఒక ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ మొబైల్ ఫోన్ ద్వారానే అరెస్టు చేస్తున్నారని ఎవరైనా ఎలా నమ్మగలరా?" అని అసహనం వ్యక్తం చేశారు.

డిజిటల్ అరెస్టులను అరికట్టడానికి చాలా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ సమస్య నిరంతరాయంగా కొనసాగుతోందని తనకు పదేపదే సమాచారం అందుతోందని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు చెప్పారు. గత వారం ఇలాంటి ఘటనతో ఒక మహిళ రూ. 2.5 కోట్లు కోల్పోయిందని ఆమె కోర్టుకు తెలిపారు. "ఈ ప్రాథమిక విషయం వారికి అర్థం కావడం లేదా? మొబైల్ ద్వారా అరెస్టు అవుతామనే భయం ఏమిటి? మొబైల్‌ను గోడకు కొడితే అరెస్టు ఆగిపోతుంది. ప్రజలలో ఏదో లోపం ఉంది. అందులో ఏముందో దేవుడికే తెలియాలి. మిమ్మల్ని మీరే బాధితులుగా చేసుకుంటున్నారు. చదువుకున్న వారందరూ మోసపోతుండటం మాకు నిరాశ కలిగిస్తోంది. మీరే డిజిటల్ పద్ధతిలో అరెస్టు అయితే తర్వాతి తరానికి ఏమి అందిస్తారు? డిజిటల్ అరెస్ట్‌పై ఏమైనా ఉత్తర్వులు ఉన్నాయేమో తెలుసుకోవడానికి ప్రజలు కోర్టు వెబ్‌సైట్‌కు కూడా వెళ్లవచ్చు." అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

దివ్యాంగులకు కనీస వయసు నిబంధన ఎత్తివేత

పుట్టినప్పటి నుంచే పింఛను
అర్హత వైకల్యం 40 శాతానికి తగ్గింపు
కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



దేశంలోని పేద కుటుంబాలకు, ప్రత్యేకించి దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమాన్ని (ఎన్ఎస్ఏపీ) పునర్ వ్యవస్థీకరించి, 2030-31 వరకు ఐదేళ్ల పాటు రూ.53,428 కోట్ల వ్యయంతో కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకం పేరును 'ప్రధాన మంత్రి సామాజిక సహాయతా యోజన'గా మార్చింది. అంతేకాకుండా ఇప్పటివరకు దివ్యాంగుల పింఛను పొందడానికి ఉన్న 18 ఏళ్ల కనీస వయోపరిమితి నిబంధనను రద్దు చేసింది. దీంతో పుట్టినప్పటి నుంచే దివ్యాంగ చిన్నారులకు పింఛను మంజూరు చేయనున్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 నిబంధనల ప్రకారం.. వైకల్య పరిమితిని 80 నుంచి 40 శాతానికి తగ్గించడంతో పాటు ఇతర క్యాటగిరీల సంక్షేమ పథకాలతో పోలిస్తే దివ్యాంగులకు అందించే సహాయం కనీసం 25 శాతం ఎక్కువగా ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది. అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా 11.40 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదకత ఆధారిత బోనస్ (పీఎల్బీ) కింద రూ.2009.61 కోట్ల చెల్లింపునకు ఆమోదం తెలిపింది.

ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎం సామాజిక సహాయతా యోజన కింద 79 ఏళ్లలోపు వయసు వారికి


నెలకు రూ.375, 80 ఏళ్లు, ఆపైబడిన వయసు వారికి నెలకు రూ.625 చొప్పున కేంద్రం తన వాటాగా అందిస్తుంది (దీనికి రాష్ట్రాలు ఇచ్చే వాటా అదనం). వృద్ధులు, వితంతువుల పింఛను పథకాలు, కుటుంబ ప్రయోజన పథకం ప్రస్తుతం ఉన్న రూపంలోనే కొనసాగుతాయి. కేంద్ర మంత్రివర్గ తాజా నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా 3.20 కోట్ల మంది ప్రయోజనం పొందుతారు. రాబోయే మూడు నెలల్లో కొత్త మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి.

దివ్యాంగులకు టోల్ మినహాయింపు కాలపరిమితి పెంపు

వైకల్య శాతం ఆధారంగా 3 నుంచి 5 ఏళ్లు

ప్రతి ఏటా ఫాస్టాగ్ రెన్యువల్‌కు స్వస్తి

దివ్యాంగుల వాహనాలకు ఇచ్చే టోల్ మినహాయింపు ఫాస్టాగ్‌ల కాలపరిమితి.. వైకల్య శాతం ఆధారంగా మారనుంది. ఇందుకు సంబంధించి సవరించిన నిబంధనలను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖవిడుదల చేసింది. ఇప్పటి వరకు వీరు ఏడాదికోసారి తమ ఫాస్టాగ్‌లను రెన్యూవల్ (పునరుద్ధరణ) చేసుకోవాల్సి ఉండేది. కొత్త నిబంధనల ప్రకారం.. 70శాతం నుంచి 100శాతం వరకు వైకల్యం కలిగిన వారికి ఐదేళ్లు చెల్లుబాటయ్యే 'ఎగ్జెంప్టెడ్ ఫాస్టాగ్'ను జారీ చేస్తారు. ఒకవేళ వైకల్యం 40-70శాతం మధ్య ఉంటే మూడేళ్ల కాలవ్యవధితో ఫాస్టాగ్ ఇస్తారు. కాల వ్యవధి ముగిసిన తర్వాత అప్పటికి వారి వైకల్య స్థితి ఆధారంగా రెన్యూవల్ చేస్తారు.



మూడేళ్ల గాజా యుద్ధం

వేలాదిమంది మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు

అక్టోబర్ 2023లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గాజాలో దాదాపు 50,000 మంది మహిళలు మరియు బాలికలు చంపబడ్డారని లేదా తీవ్రంగా గాయపడ్డారని యుఎన్ ఉమెన్ అంచనా వేసింది. అంటే ప్రతి 21 మంది గాజా మహిళలు మరియు బాలికలలో ఒకరు తమ ప్రాణాలను కోల్పోవడం లేదా జీవితకాల వైకల్యాలతో జీవించడం. ఇజ్రాయెల్ వైమానిక దాడులు మరియు భూతల సైనిక చర్యల ఫలితంగా 38,000 మందికి పైగా మహిళలు, బాలికలు మరణించగా, 11,700 మంది తీవ్రంగా గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన మొదటి రెండు సంవత్సరాలలోనే అత్యధిక ప్రాణనష్టం నమోదైనప్పటికీ, అక్టోబర్ 2025లో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినా మహిళలు, బాలికలు లక్ష్యంగానే కొనసాగుతున్నారు. గత ఏడాది కాలంలో గాజాలో మరణించిన వారిలో 277 మంది మహిళలు, బాలికలు ఉన్నారు. అక్టోబర్ 2023 నుండి ఇజ్రాయెల్ రక్షణ దళాలు గాజా అంతటా 150కి పైగా తరలింపు మరియు వలస ఆదేశాలను జారీ చేశాయి, దీనివల్ల దాదాపు పది లక్షల మంది మహిళలు మరియు బాలికలు తమ ఇళ్లను వదిలి వెళ్లవలసి వచ్చింది - అంటే గాజాలోని దాదాపు ప్రతి మహిళ మరియు బాలిక.

గాజాలోని అత్యధిక మహిళలు, బాలికలు ఎలాంటి గోప్యత లేకుండా గుడారాలలో లేదా శిథిలాలలో నివసిస్తున్నారు. మనుగడకు, గౌరవానికి అనుకూలం కాని పరిస్థితులలో, మహిళలు మరియు బాలికలు ఈ బాధ్యతలను నిర్వర్తించడానికి కనీస సాధనాలు కూడా లేకుండా పిల్లలను, రోగులను, గాయపడిన వారిని, వృద్ధులను చూసుకుంటూ, వంట చేస్తూ, శుభ్రం చేస్తూ జీవిస్తున్నారు.

మహిళలు అసురక్షిత, అపరిశుభ్రమైన పరిస్థితులలో ప్రసవించవలసి వస్తోంది, ఇది వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోంది. అదే సమయంలో, 2026 మొదటి ఆరు నెలల్లో గర్భస్రావాల సంఖ్య దాదాపు 4,000కి చేరుకుంది, ఇది 2025 చివరి ఆరు నెలల్లో

నమోదైన సంఖ్యకు మూడు రెట్లు ఎక్కువ. గాజాలో అక్టోబర్ 2023 నుండి వితంతువుల సంఖ్య మరియు కుటుంబ పెద్ద పాత్రను పోషిస్తున్న వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. గాజాలో ఇప్పుడు దాదాపు ప్రతి నాలుగు కుటుంబాలలో ఒకదానికి (అంచనా ప్రకారం 86,290 కుటుంబాలకు) ఒక మహిళ కుటుంబ పెద్దగా ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. అక్టోబర్ 2023కు ముందు ఈ రేటు ప్రతి తొమ్మిది కుటుంబాలలో ఒకటిగా ఉండేది. మహిళా గృహ యజమానుల విషయానికొస్తే, భర్తను, తండ్రిని లేదా ఇతర ప్రియమైన వారిని కోల్పోయిన దుఃఖానికి మించి దాని ప్రభావం విస్తరించి ఉంటుంది. రోజురోజుకు తీవ్రమవుతున్న ఈ పరిస్థితులలో, వారిలో చాలామంది ఇప్పుడు తమ కుటుంబాలను పోషించడం, రక్షించడం, మరియు కలిపి ఉంచడం వంటి పూర్తి బాధ్యతను మోస్తున్నారు. కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, గాజాలోని మహిళలు మరియు బాలికలు కొనసాగుతున్న ఘర్షణలు మరియు అభద్రతతో పాటు, ఆహారం, ఆశ్రయం, సురక్షితమైన నీరు మరియు పరిశుభ్రతా సామాగ్రికి తీవ్రమైన పరిమిత ప్రాప్యతను ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన మరియు విస్తృతమైన బాంబు దాడులు ఇళ్లు, వ్యాపారాలు, ఆసుపత్రులు, పాఠశాలలు మరియు దుకాణాలను నేలమట్టం చేశాయి, దీనివల్ల మహిళలు మరియు బాలికలు నిత్యావసర సేవలు మరియు ప్రాథమిక వస్తువులను పొందడం అత్యంత కష్టంగా మారింది.

మానవతా సహాయం అందకుండా ఆంక్షలు మరియు బాంబు దాడులు అపారమైన బాధలను కలిగిస్తూనే ఉన్నాయి. జూలై మరియు డిసెంబర్ 2026 మధ్య, సుమారు 702,000 మంది మహిళలు మరియు బాలికలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటారని అంచనా వేయబడింది, ఇది వారి ఆరోగ్యంపై వినాశకరమైన ప్రభావాలను చూపుతుంది, ఇందులో పోషకాహార లోపం ప్రమాదం కూడా ఉంది. సహాయంలో నమోదైన అత్యంత తీవ్రమైన క్షీణత, గాజాలోని మహిళలు మరియు బాలికలకు జీవనాధారమైన మహిళా సంఘాలకు ముప్పు కలిగిస్తోంది.

గాజా మరియు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో సహాయక చర్యలలో ముందుండి పనిచేస్తున్న మహిళా సంస్థలను ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం సర్వే చేసింది. సర్వే చేసిన 14 సంస్థలలో 13 సంస్థలు, 2025 నుండి మహిళలు మరియు బాలికలలో అవసరాల స్థాయి పెరిగిందని నివేదించాయి. సర్వే చేసిన అన్ని సంస్థలు 2025 నుండి లింగ-ఆధారిత హింస, పేదరికం మరియు మానసిక ఆరోగ్య సమస్యలలో పెరుగుదలను గమనించాయి. సర్వే చేసిన 14 సంస్థలలో 13 సంస్థలు బాల్య వివాహాలలో పెరుగుదలను గమనించాయి.

అదే సమయంలో, యుఎన్ ఉమెన్ సర్వే చేసిన 14 సంస్థలలో 13 సంస్థలు,



మహిళలు మరియు బాలికల పెరుగుతున్న అవసరాలను తీర్చగల సామర్థ్యం తమకు లేదని నివేదించాయి. నిధుల కొరతను ఎదుర్కోవడానికి, దాదాపు మూడింట రెండు వంతుల సంస్థలు మహిళలు మరియు బాలికలను నిరీక్షణ జాబితాలలో ఉంచవలసి వచ్చిందని లేదా వారిని తిరస్కరించవలసి వచ్చిందని యుఎన్ ఉమెన్‌కు తెలిపాయి. యుఎన్ ఉమెన్ గాజాలో క్షేత్రస్థాయిలో పనిచేస్తోంది. మేము మహిళలకు మరియు బాలికలకు ప్రాణరక్షక మరియు కీలకమైన మద్దతును అందించడానికి మహిళల నేతృత్వంలోని మరియు మహిళల హక్కుల సంస్థలతో కలిసి పనిచేస్తాము. ఈ మద్దతులో రక్షణ సేవలు, లింగ-ఆధారిత హింస కేసుల నిర్వహణ, న్యాయ సహాయం, మానసిక ఆరోగ్యం మరియు సామాజిక-మానసిక మద్దతు, అలాగే అత్యవసర నగదు మరియు జీవనోపాధి సహాయం వంటివి ఉన్నాయి. మహిళలు, బాలికలకు కృత్రిమ అవయవాలు అమర్చడం, బాధితులకు కౌన్సెలింగ్ అందించడం నుండి, మానవతా సహాయక చర్యలు మహిళలు, బాలికల అనుభవాలు, దృక్కోణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వరకు, మా మద్దతు వారు నిలదొక్కుకోవడానికి సహాయపడుతోంది. కానీ గాజాలోని మహిళలు, బాలికలకు శాంతి అవసరం.

గాజాలో కాల్పుల విరమణను పూర్తిగా అమలు చేయాలని ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం పిలుపునిస్తోంది. అంతర్జాతీయ చట్టాన్ని నిలబెట్టాలని, ఉల్లంఘనలకు జవాబుదారీతనం ఉండాలని, మహిళలు, బాలికలు మరియు పౌరులందరికీ రక్షణ కల్పించాలని మేము కోరుతున్నాము. మానవతా సహాయం అవసరమైన వారికి పెద్ద ఎత్తున మరియు ఎటువంటి ఆటంకాలు లేకుండా చేరాలి. సహాయక మరియు పునరుద్ధరణ ప్రయత్నాలలో మహిళలు మరియు బాలికలను కేంద్ర స్థానంలో ఉంచాలి.

హైదరాబాద్‌లో ఈగల్ ఫోర్స్ ఆకస్మిక దాడులు

వైద్యపరీక్షల్లో ముగ్గురు బాలలతో సహా 66మందికి పాజిటివ్

కలవరపెడుతున్న డ్రగ్స్ వినియోగం

హైదరాబాద్‌లో గంజాయి విక్రయాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఆకస్మిక దాడులు జరిపారు. ఈ తనిఖీల్లో ఎల్‌బీఎస్ నగర్‌లో ఇంటి నుంచే గంజాయి విక్రయిస్తున్న 75 ఏళ్ల షేక్ జాతెన్ బీని అరెస్ట్ చేశారు. నిందితురాలి ఇంట్లో 41 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమె దగ్గరి నుంచి మొత్తం 179.1 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో 70 మంది గంజాయి వినియోగదారులను గుర్తించారు. 66 మందికి వైద్య పరీక్షలు జరపగా.. ఈ పరీక్షల్లో డ్రగ్స్ తీసుకున్నట్లుగా పాజిటివ్‌గా నిర్ధారించారు. గంజాయి వినియోగదారుల్లో ముగ్గురు బాలురని, మరో 65 మందిని పునరావాస కేంద్రాలకు ఈగల్ అధికారులు తరలించారు. అలాగే, గాంధీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు 45 మందిని, ఆమనగల్ కేంద్రానికి 15 మంది, కొత్తూరు కేంద్రానికి ఐదుగురిని తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా మూలాలు, ఇతర వ్యక్తుల పాత్రపై ఈగల్ అధికారులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితురాలు షేక్ జాతెన్ బీపై గతంలో మరో ఏడు కేసులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే, గచ్చిబౌలిలో తెలంగాణ టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీలు చేసి డ్రగ్స్‌ను పట్టుకున్నారు. ఖాజాగూడా సర్వీస్ రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తుండగా ఫొటోగ్రాఫర్ ఏ. సాయిరామ్‌ను అరెస్ట్ చేశారు.

నిందితుడు సాయిరామ్ నుంచి 4.45 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రాము రూ.10 వేల చొప్పున అతడు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి కారు, డిజిటల్ వేయింగ్ మిషన్, 2 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు మహేశ్‌రెడ్డి, తాండ్ర హరిశ్చంద్ర కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు రాజమండ్రికి చెందినవారిగా గుర్తించారు.

మాదకద్రవ్యాల వినియోగం
దేశ భవిష్యత్తుకే ప్రమాదం
Drugs
Drugs
Drugs

Form - IV
(See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

1. Place of Publication	:	Hyderabad
2. Periodicity of Publications	:	Monthly
3. Printer's Name	:	M. Madhava Vasu
Whether Citizen of India?	:	Yes
Address	:	1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015
4. Publisher's Name	:	M. Madhava Vasu
Whether Citizen of India?	:	Yes
Address	:	1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015
5. Editor's Name	:	M. Madhava Vasu
Whether Citizen of India?	:	Yes
Address	:	1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015
6. Name and address of Individuals who own the Newspaper	:	M. Madhava Vasu
	:	1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015

I, M. Madhava Vasu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

M. Madhava Vasu
(Publisher)



FOR ALL WOMEN AND GIRLS

UN WOMEN

Stop digital violence against Women and Girls

Our Aim

all Human Rights for all

AIMS HUMAN RIGHTS SOCIETY SURVEY

Aims Human Rights Society Surveys

Women and Child Welfare / Freedom / Rights

Regd. No. 1808/2005

Regd. Off: Plot No.1, H. No.1-24-21/4, (24-387), Sri Sai Nagar,
Lothukunta, Alwal, Secunderabad - 500 015.